PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 41, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 01- ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## 400 కేజీల యురేనియం ఎత్తుకొచ్చేయండి?! : ట్రంప్



- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.
- అదే జరిగితే, ట్రంప్ నిప్పుతో చెలగాటం ఆడినట్లే అవుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.ఇరాన్ అణు కార్యక్రమాలు చేపట్టకూడదని ఆయన పలు మార్లు స్పష్టంగా చెప్పారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అదే జరిగితే, ట్రంప్ నిప్పుతో చెలగాటం ఆడినట్లే అవుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మిగతా 2లో

## ఇంధన కేంద్రాలపై దాడులు ఆపితే, రష్యా చమురు కేంద్రాలపై దాడులు ఆపేస్తాం




- రష్యాలోని అత్యంత కీలకమైన ఉస్ట్-లుగా చమురు ఎగుమతి టెర్మినల్‌పై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్లతో విరుచుకుపడింది.
- గత వారం రోజుల్లో ఈ కేంద్రంపై దాడి జరగడం ఇది మూడోసారి.

రష్యాలోని అత్యంత కీలకమైన ఉస్ట్-లుగా చమురు ఎగుమతి మిగతా 2లో

## మోజ్తాబా ఖమేనీ లేఖ విడుదల



- ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ కీలక ప్రకటన విడుదల చేశారు. అమెరికా చేస్తున్న దురాక్రమణ ఖండించి ఇరాన్‌కు మద్దతుగా నిలిచినందుకు ఇరాక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ కీలక ప్రకటన విడుదల చేశారు. అమెరికా చేస్తున్న దురాక్రమణ ఖండించి ఇరాన్‌కు మద్దతుగా నిలిచినందుకు ఇరాక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో

## ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తల్లి మరణంపై వైయస్ జగన్ సంతాపం



- ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తల్లి సువర్ణలత (86) తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.
- ఆమె మృతి పట్ల వైసీపీ అధినేత జగన్ సంతాపం వ్యక్తం చేశారు.
- ఈ విషాద సమయంలో ప్రకాశ్ రాజ్, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని, మనోబలాన్ని ప్రసాదించాలని జగన్ ఆకాంక్షించారు.

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తల్లి సువర్ణలత (86) తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆమె మృతి పట్ల వైసీపీ అధినేత జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ప్రకాశ్ రాజ్, మిగతా 2లో

## చట్టం వచ్చిన తర్వాత రాజధానిని

# ఎవరూ కదిలించలేరు

**2,50,893 ఇళ్లను పేదలకు పంపిణీ**

**గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది**

**నీళ్ల ట్యాప్ మాదిరిగానే పీఎన్‌జీ కనెక్షన్స్ ఇస్తాం**

**అమరావతే మన రాజధాని అని తీర్మానం చేశాం**

**5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం**

- రెండున్నర లక్షల మంది పేదలతో గృహ ప్రవేశం చేయించిన చంద్రబాబు
- 2,50,893 ఇళ్లను పేదలకు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో పేద ప్రజలకు నివాసం కల్పించాలనే లక్ష్యంగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే.అయితే ఈ ఇళ్ల పంపిణీపై సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.
- సూళ్లూరుపేట పుదూరులో నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు.
- ఈ జూన్ నాటికి 2 లక్షల 70 వేల ఇళ్లలో, సెప్టెంబర్ నాటికి లక్షా 60 వేల ఇళ్లలో గృహ ప్రవేశం చేస్తామని తెలిపారు.
- అంతేకాకుండా మరో 12 లక్షల ఇళ్లు కూడా కట్టిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అలాగే ఈ ఇళ్ల అన్నింటికీ పీఎన్‌జీ కనెక్షన్ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.
- నీళ్ల ట్యాప్ మాదిరిగానే పీఎన్‌జీ కనెక్షన్స్ ఇస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- అమరావతే మన రాజధాని అని తీర్మానం చేశామని, త్వరలోనే చట్టం తీసుకొస్తామన్నారు.
- హైదరాబాద్, చెన్నై కంటే మెరుగ్గా అమరావతిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

రాష్ట్రంలో పేద ప్రజలకు నివాసం కల్పించాలనే లక్ష్యంగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వం ఇళు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇళ్ల పంపిణీపై సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సూళ్లూరుపేట పుదూ రులో నిర్వహి ంచిన సభలో ఆయన పాల్గొ న్నారు. ఈ జూన్ నాటికి 2 లక్షల 70 వేల ఇళ్లలో, సెప్టెం బర్ నాటికి లక్షా 60 వేల ఇళ్లలో గృహ ప్రవేశం మిగతా 2లో



## పాఠ్యపుస్తకాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ



- ఇంటర్మీడియట్ సెకెండియర్ పాఠ్యపుస్తకాల లీకేజీ అంశంలో గైడ్‌లు ముద్రించే పబ్లిషర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- ఈ మేరకు ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీలకు ఆయన లేఖలు రాశారు.
- గైడ్‌లు, క్వశ్చన్ బ్యాంకులు, ఇతర స్టడీ మెటీరియల్‌ను విక్రయించే పబ్లిషర్లు ప్రభుత్వ అనుమతి రాకముందే ప్రభుత్వ కంటెంట్‌ను తీసుకుని వినియోగించుకుంటున్నారని ఆరోపించారు.

ఇంటర్మీడియట్ సెకెండియర్ పాఠ్యపుస్తకాల లీకేజీ అంశంలో గైడ్‌లు ముద్రించే పబ్లిషర్లపై మిగతా 2లో

## మూలపేట పోర్టు 70 శాతం

# పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే

**అమరావతిని రాజధానిగా ఒప్పుకుంటున్నారా?**

- ఏపీలో లా అండ్ ఆర్డర్ విషయంలో పటిష్టంగా పని చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.
- ఈవిటీజింగ్ జరగకుండా శక్తి టీమ్స్ పని చేస్తున్నాయని తెలిపారు.



ఏపీలో లా అండ్ ఆర్డర్ విషయంలో పటిష్టంగా పని చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈవిటీజింగ్ జరగకుండా శక్తి టీమ్స్ పని చేస్తున్నాయని తెలిపారు. సోమవారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మూలపేట పోర్టు 70 శాతం పూర్తి చేసింది మిగతా 2లో

## ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములపై మోదీ ధ్వజం



- అధికారం దక్కితే జేబులు నింపుకోవడమే
- ఈసారి కేరళలో ఎన్డీఏ విజయం తథ్యం
- యువత, మహిళలు, రైతులు ఆదరిస్తున్నారు
- పాలక్కాడ్ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగం

సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేరళను విచ్చలవిడిగా లూటీ చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. “రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అసలైన ఎ-టీమ్. అంతే తప్ప మిగతా 2లో

## యథేచ్ఛగా మడ అడవులను చెరువులుగా

# తవ్వుకుంటుంటే పట్టించుకోవడం లేదు

**‘రైతుల జోలికొస్తే సహించేది లేదు’**

- కూటమి ప్రభుత్వం దళారులను అడ్డుపెట్టుకుని సన్నకారు రైతులను దోచుకుంటుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు.
- బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇద్దరు ఎమ్మార్వోలు, ఆర్డీవో సాంబశివరావు ఆక్వరంగం రైతులను పట్టిపీడుస్తున్నారన్నారు.
- ‘బందరు మండల పరిధిలోని చిన్న చిన్న రైతులను చెరువులు రిపేర్లు చేయకుండా అడ్డుకుంటున్నారు.



కూటమి ప్రభుత్వం దళారులను అడ్డుపెట్టుకుని సన్నకారు రైతులను దోచుకుంటుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇద్దరు ఎమ్మార్వోలు, ఆర్డీవో సాంబశివరావు ఆక్వరంగం రైతులను పట్టిపీడుస్తున్నారన్నారు. ఈ రోజు(సోమవారం, మార్చి 30వ తేదీ) ఆక్వారైతు సమస్యలపై మిగతా 2లో

## టిడ్కో ఇళ్లు.. పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక



- టిడ్కో ఇళ్లలో ఉన్న 10 శాతం వసతులు కూడా సెంట్‌లో కట్టిన ఇళ్లలో లేవని ఎమ్మెల్యే బొండా ఉమ అన్నారు.
- సోమవారం విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో ఉన్న 10 శాతం వసతులు కూడా సెంట్‌లో కట్టిన ఇళ్లలో లేవని ఎమ్మెల్యే బొండా ఉమ అన్నారు. మిగతా 2లో

## పండించిన పంటలకు

# గిట్టుబాటు ధర ఇస్తున్నాం

**అన్నదాతలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు**

**ప్రతి ధాన్యం గింజనూ కొంటాం: మంత్రి నాదెండ్ల మనోహర్**

**కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుంది**

- జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన విజయవంతంగా సాగుతోంది.
- కోవూరు మండలం ఇనమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి..గూడూరు మండలం పేడూరు గ్రామాన్ని సందర్శించారు.
- ఈ సందర్భంగా పేడూరు ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలోని వ్యవసాయ రైతుల సదస్సుకు మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి హాజరయ్యారు.
- రైతులతో మాట్లాడి పలు అంశాలపై వారికి భరోసా కల్పించారు.
- కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.




- ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్.

నెల్లూరు: జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన విజయవంతంగా సాగుతోంది. కోవూరు మండలం ఇనమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి.. అనంతరం గూడూరు మండలం పేడూరు మిగతా 2లో

## టిడ్కో ఇళ్లపై కూటమి చంద్రబాబు క్రెడిట్ చోరీ




- జగన్ హయాంలో ఇచ్చిన ఇళ్లకు రంగులేసి తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు
- కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క ఇల్లు కట్టకుండా తప్పుడు ప్రచారం
- గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో ఊర్లకు ఊర్లు నిర్మించాం
- ఇప్పుడు టిడ్కో ఇళ్లను తమవిగా చూపుతున్న కూటమి ప్రభుత్వం మిగతా 2లో

## 400 కేజీల యురేనియం ఎత్తుకొచ్చేయండి?! : ట్రంప్

ఇరాన్ అణు కార్యక్రమాలు చేపట్టకూడదని ఆయన పలు మార్లు స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు ఆ దిశగా ఆయన ప్రయత్నాలు మరింత వేగవంతం చేస్తున్నారు.తాజా సమాచారం ప్రకారం, ఇరాన్‌లోని 450 కిలోలకుపైగా యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకోవడానికి అమెరికా సైనిక చర్యను పరిశీలిస్తున్నారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే, అమెరికా సైనికులు ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించి అత్యంత ప్రమాదకరమైన ఆపరేషన్‌ను నిర్వహించాల్సి ఉంటుంది.ట్రంప్ ప్రభుత్వం ఉన్నత స్థాయి చర్చల్లో, ఇరాన్‌లో ఉన్న 453.5 కిలోల యురేనియంను స్వాధీనం చేసుకోవడానికి అమెరికా సైనిక దళాలను పంపే యోచనలో ఉందని తెలుస్తోంది. ఈ నిర్ణయం తీసుకుంటే, అమెరికా సైనికులు ఇరాన్‌లో కొన్ని రోజులు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఉండాల్సి రావచ్చు.

## ఇంధన కేంద్రాలపై దాడులు ఆపితే, రష్యా చమురు కేంద్రాలపై దాడులు ఆపేస్తాం

టెర్మినల్‌పై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్లతో విరుచుకుపడింది. గత వారం రోజుల్లో ఈ కేంద్రంపై దాడి జరగడం ఇది మూడోసారి. అర్ధరాత్రి జరిగిన ఈ మెరుపు దాడిలో టెర్మినల్ వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఈ పరిణామం రష్యా చమురు ఎగుమతులకు కోలుకోలేని దెబ్బ తీసింది.ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ స్పందిస్తూ.. ఉస్ట్-లుగా టెర్మినల్ ఎగుమతి సామర్థ్యంలో దాదాపు 60% ప్రస్తుతం దెబ్బతిన్నట్లు ప్రకటించారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉక్రెయిన్ రాత్రికి రాత్రే సుమారు 345 డ్రోన్లను రష్యాపైకి ప్రయోగించింది.అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా చమురు రంగానికి ఎదురైన అత్యంత తీవ్రమైన ముప్పు ఇదే. రష్యా ఎగుమతి సామర్థ్యంలో ప్రస్తుతం సుమారు '40%' నిలిచిపోవడంతో రష్యా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.కాగా, రష్యా తమ ఇంధన కేంద్రాలపై దాడులు ఆపితే, తాము కూడా రష్యా చమురు కేంద్రాలపై దాడులు ఆపేస్తామని జెలెన్ స్కీ చెప్పారు. ఈ దాడులకు ప్రతీకారంగా రష్యా కూడా ఉక్రెయిన్‌పై భీకర దాడులు ప్రారంభించింది. సుమారు 400 మిసైళ్లు, డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని ఖార్కివ్, ఒడెస్సా ప్రాంతాల్లోని విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసింది.

## మోజ్తాబా ఖమేనీ లేఖ విడుదల

ఈ మేరకు ఆయన పేరుతో ఒక లేఖ విడుదల చేశారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ బ్రతికి ఉన్నారో లేదో తెలియదు అని అన్నారు. అమెరికా జరిపిన దాడిలో ఆయన తీవ్రంగా గాయపడి ఉండవచ్చు అని తెలిపారు. ఈ నేపథ్యంలో మోజ్తాబా ఖమేనీ ఇరాక్‌కు ధన్యవాదాలు తెలుపుతూ లేఖ విడుదల చేశారు.ఆ లేఖలో " అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధంలో మా దేశానికి మద్దతుగా నిలిచిన ఇరాక్ మత గురువు గ్రాండ్ అయతుల్లా అలీ సిస్తానీకి, అలాగే ఇరాక్ ప్రజలకు ధన్యవాదాలు". అని లేఖలో పేర్కొన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న దురాక్రమణను వ్యతిరేకిస్తూ ఇరాక్ స్పష్టమైన స్టాండ్ తీసుకోవడాన్ని అభినందించారు.కాగా ఆయతుల్లా ఖమేనీ మరణం తర్వాత ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇరాన్ మూడవ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆనాటి నుంచి నేటి వరకూ మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. ఆయన కేవలం కొన్ని రాతపూర్వక ప్రకటనలు మాత్రమే విడుదల చేశారు. గతంలో జరిగిన వైమానిక దాడిలో ఆయన గాయపడ్డారని, ప్రస్తుతం కోలుకుంటున్నారని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది.

## ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తల్లి మరణంపై వైయస్ జగన్ సంతాపం

ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని, మనోబలాన్ని ప్రసాదించాలని జగన్ ఆకాంక్షించారు. సువర్ణలత గారి ఆత్మకు శాంతి చేకూరాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాతృ వియోగం అనేది ఎవరూ పూడ్చలేని లోటని, ఈ కష్ట కాలంలో ప్రకాశ్ రాజ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న సువర్ణలత ఈ ఉదయం బెంగళూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటిస్తున్నారు.ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ గారి మాతృమూర్తి శ్రీమతి సువర్ణలత గారు కన్నుమూయడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీమతి సువర్ణలత గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఈ క్లిష్ట సమయంలో ప్రకాష్ రాజ్ గారికి, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం, మనోబలం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## పాఠ్యపుస్తకాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ

కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీలకు ఆయన లేఖలు రాశారు. గైడ్‌లు, క్వశ్చన్ బ్యాంకులు, ఇతర స్టడీ మెటీరియల్‌ను విక్రయించే పబ్లిషర్లు ప్రభుత్వ అనుమతి రాకముందే ప్రభుత్వ కంటెంట్‌ను తీసుకుని వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. కాగా వీజీఎస్ పబ్లిషర్స్ నుంచే ఇంటర్మీడియట్ కంటెంట్ లీకైనట్లు ఇంటర్ విద్యాబోర్డు గుర్తించింది.

## టిడ్కో ఇళ్లు.. పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక

సోమవారం విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ఈ ఇళ్ల నిర్మాణం కోసం గత 5 ఏళ్లలో ఎన్నో బాధలు, కష్టాలు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను ఇచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసుకోమని బలవంతం చేశారని.. కానీ చాలా మంది ప్రజలు వారి అబద్ధపు మాటలు నమ్మకుండా నిలబడ్డారని ఎమ్మెల్యే బొండా ఉమ తెలిపారు.పార్టీలకు అతీతంగా టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2019 - 24 మధ్య జగన్ హయాంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. జగన్ వైరస్ వల్ల అన్ని వ్యవస్థలు కుంగిపోయాయని వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థలను గాడిలో పెట్టడానికి ఇంత కాలం పట్టిందని ఎమ్మెల్యే తెలిపారు.

## టిడ్కో ఇళ్లపై కూటమి చంద్రబాబు క్రెడిట్ చోరీ

టిడ్కో ఇళ్ల అంశంపై కూటమి ప్రభుత్వ తీరును బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున తప్పుపట్టారు. గత ప్రభుత్వం పేదలకు నిర్మించి అందించిన ఇళ్లకు కేవలం రంగులు వేసి వాటిని తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. టిడ్కో ఇళ్లపై కూడా చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని, వాస్తవాలను గుర్తించాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున హితవు చెప్పారు.ప్రజలు వాస్తవాలు చెబుతున్నా పట్టని బాబు:సీఎం చంద్రబాబు ఆలోచనలు దారుణంగా ఉన్నాయి. ప్రజలకు ఏమీ తెలియదన్నట్లుగా ఆయన పాలన సాగిస్తున్నారు. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని చెబుతున్నారు. కానీ ప్రజలే బయటకు వచ్చి, తమకు గత ప్రభుత్వంలోనే పట్టాలు ఇచ్చారని చూపుతున్నా, చంద్రబాబు పట్టించుకోవడం లేదు. క్రెడిట్ చోరీకి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారినట్లు కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 21 నెలల్లో 5,50,314 ఇళ్లు నిర్మించామని, ఈరోజు 2,50,893 ఇళ్లకు గృహ ప్రవేశం చేశామని చెబుతున్నారు. కానీ 2014--2019 మధ్య గానీ, 2024 నుంచి ఇప్పటి వరకు గానీ ఒక నిరుపేద కుటుంబానికి ఒక్క ఇల్లు కట్టించి ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా? వారి కోసం కనీసం గజం భూమి అయినా చంద్రబాబు కొన్నారా?గత ప్రభుత్వంలో జగన్‌గారు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలిచ్చి, 21.75 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, వాటిలో 9.02 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. పేదల ఇళ్ల కోసం 17,005 వైయస్సార్ జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ఆ కాలనీలు ఒక ఊరు మాదిరిగా ఏర్పడ్డాయంటే అతిశయోక్తి కాదు. ఆ కాలనీల పేరు మార్చి, ఇప్పుడు వాటినే తామే ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో సొంత ఇల్లు లేకుండా ఒక్క కుటుంబం కూడా ఉండకూడదన్న లక్ష్యంతో, గత ప్రభుత్వం వ్యవహరించింది. పేదలందరికీ పక్కా ఇల్లు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నడూ లేని విధంగా రూ.31,832 కోట్ల విలువైన 71,811 ఎకరాలను సేకరించి, అందులో 25,374 ఎకరాలను కొనుగోలు చేసి దాదాపు రూ.11,343 కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో కాలనీలు మాత్రమే కాదుం ఊర్లకు ఊర్లే నిర్మించారు. ఈ రోజు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న జగనన్న కాలనీలు కనిపిస్తున్నాయి. దివంగత మహానేత వైయస్సార్‌గారి వారసుడిగా జగన్‌గారు నిరుపేదలకు గూడు కల్పించిన విధానం అది. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణంలో జంగిల్ క్లియరెన్స్, డ్రైనేజీ, ఎలక్ట్రిసిటీ, మంచినీటి సౌకర్యాల కోసం మాత్రమే దాదాపు రూ.32,900 కోట్లు ఖర్చు చేశారు. నాడు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల మార్కెట్ విలువ సుమారు రూ.75 వేల కోట్లు ఉంటుంది. ఇక లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి విలువ ప్రాంతాన్ని బట్టి కొన్ని చోట్ల దాదాపు రూ.20 లక్షలు. అవేవీ చేయని కూటమి ప్రభుత్వం వచ్చి అబద్ధాలతో మోసం చేసే ప్రయత్నం చేస్తోంది. ఎవరికో పుట్టిన బిడ్డను మా బిడ్డగా చెప్పుకునే పరిస్థితి ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. టిడ్కో ఇళ్లన్నీ తామే నిర్మించామని చెప్పుకోవడం దారుణం.టిడ్కో ఇళ్లకు సంబంధించి గత ప్రభుత్వంలో దాదాపు 35 పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)ల్లోని 66 ప్రాంతాల్లో లక్షకు పైగా ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. సాలూరు, విజయనగరం, చిత్తూరు వంటి పట్టణాల్లో కూడా టిడ్కో ఇళ్లు పంపిణీ చేశాం. మొత్తంగా 1,24,680 ఇళ్లు అన్ని వసతులతో జీ+3 విధానంలో నిర్మించి ఇచ్చాం. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లకు రంగులు వేసి కూటమి ప్రభుత్వం తమదిగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు. ప్రభుత్వంలో ఉన్నవారు కొత్త కార్యక్రమాలు చేపట్టాలి, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. కానీ వైఎస్ జగన్ గారు చేసిన మేలును మీరు క్రెడిట్‌గా తీసుకోవడం అన్యాయం. అందుకే ప్రజలే ఈ రోజు బయటకు వచ్చి మీ మాయను, భూంరాంగ్ వ్యవహారాలను బట్టబయలు చేస్తున్నారు.

# చట్టం వచ్చిన తర్వాత రాజధానిని ఎవరూ కదిలించలేరు

చేస్తామని తెలిపారు. అంతేకాకుండా మరో 12 లక్షల ఇళ్లు కూడా కట్టిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అలాగే ఈ ఇళ్ల అన్నింటికీ పీఎన్‌జీ కనెక్షన్ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.రినీళ్ల ట్యాప్ మాదిరిగానే పీఎన్‌జీ కనెక్షన్స్ ఇస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతే మన రాజధాని అని తీర్మానం చేశామని, త్వరలోనే చట్టం తీసుకొస్తామన్నారు. చట్టం వచ్చిన తర్వాత రాజధానిని ఎవరూ కదిలించలేరని చెప్పారు. హైదరాబాద్, చెన్నై కంటే మెరుగ్గా అమరావతిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. చేపటలను స్థానిక మత్స్యకారులే పట్టుకోలని, నష్టం కలిగిస్తే సహించమని చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లా నాయుడుపేట వేదికగా రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేసి, వారితో గృహ ప్రవేశాలు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత భారీ స్థాయిలో గృహ ప్రవేశాలు నిర్వహించడం ఇది రెండోసారి కావడం విశేషం.నేడు పంపిణీ చేసిన ఇళ్లలో 1,00,875 టిడ్కో (౧×ఐజా) గృహాలు ఉండగా, మిగిలిన 1,50,018 సాధారణ గృహాలు ఉన్నాయి. గతేడాది నవంబర్ 12న ఇప్పటికే 3 లక్షల మందికి ప్రభుత్వం ఇళ్లను అందించింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పేదల ముఖాల్లో ఆనందం చూస్తుంటే నా జన్మ ధన్యమైందనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని, పేదల పొట్ట కొట్టిందని మండిపడ్డారు. పేదలు మురికివాడల్లో కాదు, గౌరవప్రదమైన టిడ్కో ఇళ్లలో ఉండాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు కట్టిన రూ. 174 కోట్లను మాయం చేశారని, ఆ మొత్తాన్ని తిరిగి 82 వేల కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు.ప్రతి ఇంటికీ సీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, దానికి రాయితీ కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, బీసీలకు రూ. 20 వేల విద్యుత్ రాయితీ ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఏప్రిల్ నుంచి తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, సరిగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేల పనితీరుపై కూడా నిఘా ఉంటుందని, ప్రజల మెప్పు పొందని నాయకులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టెక్నాలజీని ఉపయోగించి పెన్షన్ల పంపిణీని రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నామని తెలిపారు.సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు వెల్లడించారు. భవిష్యత్తులో మహిళలకు రాజకీయంగానూ ఎక్కువ సీట్లు కేటాయిస్తామన్నారు. "హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా అమరావతిని నిర్మిస్తాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గృహ ప్రవేశం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మట్టుత్తంలో గృహ ప్రవేశాలు చేయించడం ఇది రెండోసారి. మట్నదటి విడత కింద 12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మట్నత్తం 2,50,893 గృహాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపుకుంటున్నాం. ఇది ఒక చరిత్ర. మీ అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోంది. భవిష్యత్తులో మీకన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాది. వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం.ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది. ఎక్కడ చూసినా అవినీతి, అధికార దుర్వినియోగం. రూ.174కోట్లు లబ్ధిదారులు కడితే వాటినీ మాయం చేశారు. 82 వేల కుటుంబాలకి ఆ డబ్బును అకౌంట్లలో వేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులని దారి మళ్లించారు. నివాస యోగ్యంకాని స్థలాల్లో ఇళ్లు కట్టించారు. వైజాగ్‌లో ప్యాలెస్ నిర్మించుకున్నారు కానీ పేదలకి ఇళ్లు ఇవ్వడానికి మనసు రాలేదు. అంత పనికిమాలిన ప్రభుత్వాన్ని నేను నా జీవితంలో చూడలేదు.పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు. ఇలాంటి టిడ్కో ఇళ్లలో ఉండాలి. మీలో ఆశలు చిగురించాలి. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. బ్రహ్మాండంగా ఇళ్లు కట్టించి, పేదలకి ఒక ఆస్తి కల్పిస్తాం. ప్రతి ఇంటికీ జచీ+ కనెక్షన్ ఉండాలి. దానికి కూడా రాయితీ ఇస్తాం. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని పథకం మొదలెడితే దాన్నీ పాడు చేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంట్లో ఎక్కడికక్కడ విద్యుత్ తయారు చేసుకునే అవకాశం కల్పించాం. ఎస్సీలు, ఎస్టీలకి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకి రూ.20 వేలు రాయితీ ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలని చేస్తాం. రాబోయే ఎన్నికల్లో మహిళలకి సీట్లు పెరగబోతున్నాయి. వైసీపీ పాలనలో పోలవరాన్ని నాశనం చేశారు. గోదావరి పుష్కరాలకంటే ముందుగానే పోలవరాన్ని పూర్తి చేస్తాం.అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత మేము తీసుకుంటాం. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు. ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తాం. బాగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తాం. ప్రజలు మెచ్చేలా నాయకులు, అధికారులు పనిచేయాలి. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేకపోతే ఊరుకునేది లేదు. టెక్నాలజీ ఉపయోగించి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాం. పెన్షన్ల పంపిణీని రియల్‌టైమ్ మానిటర్ చేస్తున్నాం.

# పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నాం

గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పేదూరు ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలోని వ్యవసాయ రైతుల సదస్సుకు మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పలు అంశాలపై వారికి భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో కేంద్రాలను రైతులకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్నదాతలు, ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు వారధి వంటి వారని.. రైతును దోపిడీ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.తూకాల్లో ఎక్కువ ధాన్యం తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. అన్నదాతలను దోపిడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల చెప్పారు. న్యాయబద్ధంగా పారదర్శకంగా రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఉంటే వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలని, అధికారులకూ చెప్పాలని రైతన్నలకు మంత్రి సూచించారు. సమస్యలను బాధ్యతగా తీసుకుని తొలగిస్తామని.. మీ సమస్యలు తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. జాతీయ ఉపాధి పథకం కింద గ్రామాల్లో ధాన్యం కల్లాలు ఏర్పాటు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు.ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. చివరి వరకు ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు.ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.వట్టినాగులపల్లిలో సతీశ్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీ గల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్‌ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు.

## మూలపేట పోర్టు 70 శాతం పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే

కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ప్రతీ విషయంలో 'క్రెడిట్' చోరీ చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 'మాది పని చేస్తున్న ప్రభుత్వం.. వాటాలు అడగని ప్రభుత్వం' అని తేల్చిచెప్పారు.గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులను ఎత్తేసిన పరిస్థితి ఏర్పడిందని అనిత విమర్శించారు. వైసీపీ వాళ్ళు వాటాలు, భాగస్వామ్యం అడిగారు కాబట్టి చాలా ప్రాజెక్టులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. రాజధాని అమరావతిపై మండలిలో కూడా తీర్మానం చేయాలని వైసీపీ నేతలు చెబుతున్నారని... అసలు ఇంతకీ వారు రాజధానిగా అమరావతిని ఒప్పుకుంటున్నారా లేదా... సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ స్వాగతిస్తే ఎందుకు అసెంబ్లీకి రావట్లేదని నిలదీశారు. 'ప్రాజెక్టుల కోసం ఏ రైతు కూడా కన్నీరు కారుస్తూ భూమి ఇవ్వకూడదు. అది మా పాలసీ' అని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అహర్నిశలు కష్టపడుతున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం బోదుగల్లం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత టీడీపీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి అనిత కార్యకర్తల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించడంతో పాటు, వారితో ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ సీనియర్ కార్యకర్తలను సత్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, బోదుగల్లం గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలం కార్యకర్తలే అని, కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్నారు. 44 సంవత్సరాలుగా టీడీపీ విజయవంతంగా కొనసాగుతుండటానికి కార్యకర్తలే కారణం అని పేర్కొన్నారు.అలాగే, ఎన్టీ రామారావును యుగపురుషుడిగా అభివర్ణిస్తూ, ఆయన రాజకీయాల్లోకి రావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. మహిళలకు సమాన హక్కులు, రాజకీయ ప్రాధాన్యత కల్పించిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. మహిళ విద్య, ఆరోగ్యంపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తు చేశారు. ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టీడీపీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. గత పాలనలో కూడా టీడీపీ కార్యకర్తలు భయపడకుండా పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి అనిత కార్యకర్తలతో కలిసి భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## యథేచ్ఛగా మడ అడవులను చెరువులుగా తవ్వుకుంటుంటే పట్టించుకోవడం లేదు

జాయింట్ కలెక్టర్‌కు పేర్ని నాని ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా అనంతరం మీడియాతో మాట్లాడారు పేర్ని నాని. 'బందరు మండల పరిధిలోని చిన్న చిన్న రైతులను చెరువులు రిపేర్లు చేయకుండా అడ్డుకుంటున్నారు. రెవెన్యూ యంత్రాంగం మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు సహకరిస్తున్నారు. వందల ఎకరాల రైతులకు రెడ్ కార్పెట్ వేస్తున్నారు. ఎకరా రెండు ఎకరాల రైతులపై ఆంక్షలు విధిస్తూ వికృత సంస్కృతికి రెవిన్యూ సిబ్బంది పాల్పడుతున్నారు. ఎకరం రిపేరుకు 50,000 బోరు వేసేందుకు మరో 50 వేలు వసూలు చేస్తూ ఆక్వా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పెదపట్నం కానూరు గ్రామాలలో యథేచ్ఛగా మడ అడవులను చెరువులుగా తవ్వుకుంటుంటే పట్టించుకోవడం లేదు. కోన గ్రామంలో 83 సెంట్ల రైతును రికార్డులు చూపించమంటూ ఆర్డీవో నా నా హైరానా చేశారు. రైతు చెరువును పూడ్చమని ఆదేశించడం ఏంటి?, ముడుపుల మాయలో బందరు ఆర్డీఓ ఎమ్మార్వోలు రైతులపై అగత్యాలకు పాల్పడితే సహించబోం' అని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పై అసెంబ్లీలో తీర్మానం పెట్టినంత మాత్రన చట్టబద్ధత రాదని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినానిఅన్నారు. చట్టబద్ధతకు శాసన మండలి ఆమోదం అవసరం లేదా ? అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం శనివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అసెంబ్లీ సమావేశంలో రాజధాని చట్టబద్ధతపై తీర్మానం చేసిన అంశంపై ఆయన స్పందించారు. అమరావతి చట్టబద్ధత పేరుతో అసెంబ్లీలో ఆరుగంటల పాటు చంద్రబాబు పెద్ద డ్రామా చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.అమరావతి చంద్రబాబుకు ఏటీఎంగా పనికి వస్తోందని ఆరోపించారు. అమరావతి కోసం ఇప్పటి వరకు 21 వేల కోట్లు ఖర్చుచేశారని, తాత్కాలిక అసెంబ్లీ సచివాలయం, హైకోర్టుకు ఎన్ని కోట్లు ఖర్చు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణాలు జరిగాయని స్పష్టం చేశారువైఎస్ జగన్‌కు అమరావతిపై కోపం లేదని, కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని ప్రశ్నించారు. అమరావతిలో పేదలకు వైఎస్ జగన్ ఇచ్చిన ఇళ్ల పట్టాలను చంద్రబాబు రద్దు చేశారని పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని, కడప స్టీల్ ఫ్యాక్టరీ, విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలని తీర్మానం పెట్టాలని కోరారు.ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు.

## ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములపై మోదీ ధ్వజం

ఎవరికీ బి-టీమ్ కాదు" అని తేల్చిచెప్పారు. ఆదివారం కేరళలోని పాలక్కాడ్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని తేల్చిచెప్పారు. కేరళ ప్రజల మద్దతు, ఆశీస్సులతో ఎన్డీయే ప్రభుత్వం రాబోతోందని అన్నారు.కేరళకు సేవ చేసే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాగానే 'మోదీ గ్యారంటీ'ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఈసారి భిన్నమైన వాతావరణం కనిపిస్తోందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. సమాజంలో వేర్వేరు వర్గాల నుంచి ఎన్డీయేకు ఆదరణ పెరుగుతోందన్నారు. కేరళ యువత, మహిళలు, రైతన్నలు బీజేపీ కూటమిని ఎంతగానో అభిమానిస్తున్నారని వెల్లడించారు.కేరళను ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ విపరీతంగా లూటీ చేశాయని మోదీ మండిపడ్డారు. "రాష్ట్రంలో ఆ రెండు కూటముల మధ్య అవగాహన ఉంది. ఒకరి తర్వాత ఒకరు అధికారంలోకి వచ్చి, జేబులు నింపుకొనేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనివల్ల కేరళ ఆర్థికంగా నష్టపోయింది. బీజేపీ అధికారంలోకి వస్తే ఆ అక్రమాలు బయటకు వస్తాయని బెదిరిపోతున్నాయి. మేం గెలిచాక ఆ కుంభకోణాలపై దర్యాప్తు జరిపిస్తాం" అని ప్రకటించారు.పదేళ్ల ఎల్‌డీఎఫ్ పాలనలో కేరళ రుణ భారం మూడు రెట్లు పెరిగి రూ.5 లక్షల కోట్లు దాటేసిందని మోదీ చెప్పారు. "ఈ సొమ్మంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ ప్రజలు నిలదీస్తున్నారు. అది ఎల్‌డీఎఫ్ నేతల జేబుల్లోకే వెళ్లింది. మేం రాగానే ఆ సొమ్మంతా కక్కించి రాష్ట్ర అభివృద్ధికి వెచ్చిస్తాం. కేరళ ప్రగతి కోసం కేంద్రం భారీగా నిధులిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాల కంటే రాష్ట్రానికి మేమే ఎక్కు నిధులు విడుదల చేశాం" అని చెప్పారు. "మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఆర్థిక సమగ్రత, ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణంపై దృష్టి పెట్టాం.చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి పార్లమెంట్‌లో 'నారీశక్తి వందన్ అధినియమ్ చట్టం' తెచ్చాం. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలేమో అత్యాచారం కేసుల్లో దోషులుగా తేలుతున్నారు" అని మండిపడ్డారు. పశ్చిమాసియా పరిణామాలపై కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం ప్రమాదక రమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మోదీ దుయ్యబట్టారు. దానివల్ల గల్ఫ్ దేశాల్లోని భారతీయుల ప్రాణాలకు ముప్పుందన్నారు. కేరళలోని త్రిసూర్‌లో మోదీ ఆదివారం భారీ రోడ్ షో నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు, కాషాయం రంగు తలపాగా ధరించి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. పాలక్కాడ్ సభలో మోదీ కేరళ సంప్రదాయ డోలు వాద్యం 'చెండా'పై దరువేశారు. దాంతో సభికులు హర్షధ్వానాలు వెలిబుచ్చారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక దాకా జనం రోడ్డుకు ఇరువైపులా నిల్చొని మోదీకి స్వాగతం పలికారు. వేదికపై చెండాను వాయించడానికి ఆయన కర్రలు చేతుల్లోకి తీసుకోగానే ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఆయన అర నిమిషం పాటు కొన్ని బీట్లు వాయించి అలరించారు. సభలో ఇద్దరు చిన్నారులు పెయింటింగ్‌లను పట్టు కొని ఉండటం గమనించిన మోదీ, వా టిపై వాళ్ల పేర్లు, చిరునామా రాయాలని వారికి సూచించారు. వారికి తాను ప్రత్యు త్తరం పంపుతానన్నారు. ఆ పెయింటింగులను తీసుకో వాలని తన భద్రతా సిబ్బందికి సూచించారు. సభలో మైక్‌కు సంబంధించిన పరికరం నుంచి పొగలు రావడం కాసేపు కలకలం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఇంధన సంక్షోభాల వంటి క్లిష్ట పరిస్థితులను 140 కోట్ల మంది భారతీయుల సమష్టి సహకారంతో దేశం దీటుగా ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## రంప యర్రంపాలెం అగ్ని ప్రమాద బాధితులకు కంబాల చేయూత

**రెండు కుటుంబాలకు 15,000 రూపాయలు నగదు, 50 కిలోల బియ్యం పంపిణీ.**



గోకవరం-నేటిసుబోదయ.:గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామంలోని గంగ భవాని నగర్ శివారులో కుంజాల రఘుపతి, కుటేటి దుర్గాలకు చెందిన రెండు తాటకిల్లు సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధం అయ్యాయి. బాధితులు కట్టు బట్టలతో వీధిన పట్టారు. ఈ విషయాన్ని కంబాల యువసేన అధ్యక్షులు, ఉంగరాల మణిరత్నం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన అందుబాటులో లేనప్పటికీ ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రెండు కుటుంబాలకు 15,000 రూపాయలు నగదు, 50 కిలోల బియ్యాన్ని ప్రకటించారు. వాటిని రామసేన సభ్యులు బీజేపీ నాయకులు బాధితుల వద్దకు వెళ్లి వారికి అందజేసి, వారిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కంబాల శ్రీనివాసరావు బాధితులను వీడియో కాల్ ద్వారా పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, నెల్లి శ్రీను, తుమ్మల బుజ్జి, పదిలం చక్రారావు, కాళ్ళ బుజ్జి, గంటా రాధాకృష్ణ, మండే గౌతమ్, అంబటి శ్రీను, పోతుల కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉజ్జయినిలో ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు



ఉజ్జయిని, నంద్యాల, నేటి శుభోదయ ::: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని క్షిప్రానది ఒడ్డున ఉన్న అత్యంత పురాతనమైన, పవిత్రమైన హిందూ పుణ్యక్షేత్రం ఉజ్జయినిలో మంగళవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డి లు ప్రత్యేక పూజలు చేశారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన ఉజ్జయిని మహాకాళేశ్వరునికి, మహంకాళి అమ్మవార్లకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు విశేష పూజలు చేశారు. ఇక్కడ ప్రతి 12 ఏళ్లకు కుంభమేళా (సింహస్థ) జరుగుతుందని. ఉజ్జయిని చారిత్రాత్మక కేంద్రం, మోక్షదాయిని నగరమని పిలువబడుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు అన్నారు.

## కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీసు స్టేషన్ లో పేలుడు ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత

**- కృష్ణా జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి**

**-పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం**



అమరావతి, నేటి శుభోదయ :::కృష్ణా జిల్లాలోని చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై రాష్ట్ర హోం మంత్రి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, వెంటనే స్పందించిన మంత్రి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఎస్ఐ దుర్గాంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా సహా ఇతర సిబ్బందికి తక్షణం మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడలోని ఆస్పత్రికి తరలించి ప్రత్యేక వైద్యం అందించాలని అధికారులను సూచించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను సేకరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

## ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు



ఖమ్మం, హైదరాబాద్ , నేటి శుభోదయ ::: నక్సలైట్ల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు చివరి రోజున దంతేవాడలో ఐదుగురు నక్సలైట్లు లొంగిపోయారు. లక్షల రూపాయల రివార్డు ఉన్న ఈ ఐదుగురు నక్సలైట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పి., సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డీఐజీ రాకేష్, దంతేవాడ కలెక్టర్ దేవేశ్ కుమార్ ధ్రువ్‌ల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లలో భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ సభ్యుడు సోమెన్ కర్తి ప్రముఖంగా ఉన్నారు. ఈ నక్సలైట్ నాయకుడు బీజాపూర్ జిల్లాలోని మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్లి నివాసి. సదరు నాయకుడిపై రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల రివార్డును ప్రకటించింది. ఈ వరుసలో భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ పార్టీ సభ్యురాలు లఖ్మా పోయం కూడా ఉన్నారు. ఈ నక్సలైట్ బీజాపూర్‌కు చెందినవారు.ఈ నక్సలైట్ బీజాపూర్ జిల్లాలోని మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెచపాల్ నివాసి. ఈ నాయకుడిపై రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష రివార్డును ప్రకటించింది. భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ పార్టీ సభ్యురాలు సరితా పోడియం కూడా లొంగిపోయి ప్రధాన స్రవంతిలోకి వచ్చారు. ఈ నాయకురాలు బీజాపూర్ జిల్లాలోని జాంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని హింగం నివాసి. జోగి కల్మ కూడా ఇంటికి తిరిగి వచ్చారు.సదరు నాయకుడు బీజాపూర్ జిల్లాలోని బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేంద్ర నివాసి. గంగలూర్ ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు మోతీ ఓయం కూడా లొంగిపోయారు. సదరు నక్సలైట్ నాయకుడు బీజాపూర్ జిల్లాలోని గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిడియా నివాసి. రాష్ట్ర ప్రభుత్వం పార్టీ సభ్యులపై ఒక్కొక్కరిపై లక్ష రూపాయల రివార్డును ప్రకటించింది.

## గంగాభవాని నగర్ లో రాత్రి అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిల్లు అగ్నికి హాహుతి



గోకవరం-నేటిసుబోదయ. :గోకవరం మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామం గంగాభవాని నగర్ లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకి ళ్ళు దగ్ధమయ్యాయి.గ్రామానికి చెందిన కుంజాల శ్రీను, కుటేటి సింహాద్రి లకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి ఆ య్యాయి.అగ్ని ప్రమాదంలో సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.అగ్ని ప్రమాద బాధితులలో లావణ్య బాలిక పదవ తరగతి పరీక్షలు రాస్తున్నందున ఆమెకు సంబంధించిన హాల్ టికెట్ కూడా అగ్నికి ఆహుతి అయింది. సంఘటన స్థలాన్ని తాసిల్దార్ పి. రామకృష్ణ, ఎంపీడీవో ఎం. గోవిందు, గ్రామ సర్పంచ్ హర్షిత ప్రకాష్ సందర్శించి బాధితులు అవసరమైన బియ్యం, వంటసామాగ్రి అందజేశారు. వీరు వెంట టీడీపీ నాయకులు సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము,మురళి,విష్ణు,రాఘవులు తదితరులు ఉన్నారు.

# నెల్లూరు, కడప జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

**- నేడు వింజమూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**ఒంటిమిట్టలో సీతారాములవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్న సీఎం దంపతులు**

**- రాత్రికి ఒంటిమిట్టలోనే సీఎం బస**

అమరావతి, నేటి శుభోదయ ::: నెల్లూరు, కడప జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించనున్నారు. ఓవైపు పేదల సేవలో, మరోవైపు భగవంతుని సేవలో అన్నట్టుగా ఒకే రోజు రెండు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. మొదట నెల్లూరు జిల్లా, వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పింఛన్లు అందించ నున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా ఒంటిమిట్టకు వెళ్లి సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా సీతారాముల వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారు.

**- 22 నెలల్లో రూ.60,437 కోట్లు పంపిణీ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు నేరుగా అతిపెద్ద నగదు బదిలీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం ద్వారా జరుగుతోంది. 22 నెలల్లోనే రూ.60,437 కోట్లను ప్రభుత్వం పింఛన్ల రూపంలో పేదలకు అందించింది. ఈ ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 62.60 లక్షల మందికి పింఛనుదారులకు రూ.2,724 కోట్లను విడుదల చేసింది. ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొనే నెల్లూరు జిల్లాలో 2.91 లక్షల మందికి రూ.128 కోట్లు, ఉదయగిరి నియోజకవర్గంలో 39,330 మందికి రూ.17.81 కోట్లు, వింజమూరు మండలంలో 5,484 మందికి రూ.2.47 కోట్లను ప్రభుత్వం పింఛన్లు ఇవ్వనుంది. నెల్లూరు జిల్లా వింజమూరు పర్యటన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా కడప జిల్లా, ఒంటిమిట్ట చేరుకుంటారు. ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు.

**- సీఎం పర్యటన జరిగేదిలా**

బుధవారం ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11 గంటలకు సీఎం చంద్రబాబు వింజమూరు చేరుకుంటారు. వింజమూరులోని ఉత్తర ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీని చేపడతారు. లబ్ధిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పాతూరు ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొంటారు. 02.15 గంటలకు ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకుని సాయంత్రం 04.25 గంటలకు ఒంటిమిట్టకు సీఎం చేరుకుంటారు. 06.15 గంటలకు కోదండ రామస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 06.45 గంటలకు కళ్యాణవేదికలో నిర్వహించే సీతారాముల వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారు.

## వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలి

**- కౌలు రైతులకు నిర్దేశించిన మేర రుణాలు అందించాలి**

**- పిఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజన పథకంలో 10 వేల యూనిట్లకు రుణాలు అందించాలి**

**- బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణా ప్రణాళిక లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష**





ఏలూరు, నేటి శుభోదయ ::: జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికను ననుసరించి ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం బ్యాంకర్ల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2025- 26 వార్షిక రుణ ప్రణాళిక అమలులో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యతా రంగాలలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పంట రుణాలుగా 13 వేల 965 కోట్ల రూపాయలు రుణ లక్ష్యాలను సాధించారని, అదేసమయంలో ప్రాధాన్యతా రంగాలలో 48. 17 శాతం మాత్రమే లక్ష్యసాధనపై కలెక్టర్ స్పందిస్తూ ప్రాధాన్యతా రంగాలలో నూరుశాతం లక్ష్యసాధన జరిగేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు 2025 2025 ఖరీఫ్, రబీ కాలానికి 375 కోట్ల రూపాయలు రుణాలు అందించాల్సి ఉండగా 124 కోట్ల రూపాయలు మాత్రమే అందించారన్నారు. ఎంఎస్ఎంఈ లక్ష్యాలలో 65. 84 శాతం మాత్రమే లక్ష్య సాధన చేశారన్నారు. కౌలు రైతులకు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు కూడా నిర్దేశించిన లక్ష్యాల మేర రుణాలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించేలా బ్యాంకర్లతో సమన్వయము చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 13 వేల 659 స్వయం సహాయక సంఘాలకు 1364. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. పట్టణ ప్రాంతాలలోని 2050 స్వయం సహాయక సంఘాలకు 242. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజన పథకంలో 5620 దరఖాస్తులు మాత్రమే మంజూరు చేయడంపై కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 10 వేల యూనిట్లు ఏర్పాటుచేయాలని లక్ష్యాలను నిర్దేశించిందని, లక్ష్యాలు సాధించే దిశగా బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. జిలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు 219 దరఖాస్తులు అందగా, 31 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, 22 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి కారణాలు తెలుసుకుని, పరిష్కరించదగిన అంశాలు ఉంటె పరిశీలించాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. చిన్న వ్యాపారుల ఆర్ధికాభివృద్ధికి ఉద్దేశించిన పిఎం స్వనిది పథకంలో 1325 దరఖాస్తులు బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు రుణాలు అందించాలన్నారు. పిఎంఈజిపి పెండింగ్ లో ఉన్న 44 దరఖాస్తులు, పిఎం విశ్వకర్మ పథకంలో పెండింగ్ లో ఉన్న 166 దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఎంతో అనువైన పరిస్థితులు ఉన్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువులకు రుణాలు అందించే సమయంలో పశువుల భీమా పథకాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ రెడ్డి, ,ఆర్బీఐ ఈఎల్డియు డి. ఎలమంద, నాబార్డ్ ఏజీఎం అనిల్ కాంత్, ఎల్డిఎం నీలాద్రి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, ఉద్యానవనాలు శాఖాధికారి సాజా నాయక్, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, డిఆర్డిఏ ఏపిఎం భూషణం, మెప్మా పీడీ ఎం. రాజబాబు,



వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా 2026-27 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్లెట్ ను కలెక్టర్ విడుదల చేశారు.

## మహిళా చైతన్యానికి నిలువుటద్దం

### మోటూరు ఉదయం వర్ధంతి వేళ 'సూర్యవతి హాలు' ప్రారంభం



కూనవరం: మార్చ్ 31: ( నేటి శుభోదయం ):తెలుగు నేలపై మహిళా హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన ధీర వనిత మోటూరు ఉదయం గారి వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడ సమీపంలోని వడ్డేశ్వరంలో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఉమ్మడి కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న మాజీ ఎమ్మెల్సీ మానికొండ సూర్యవతి గారి జ్ఞాపకార్థం నిర్మించిన హాలును ఈ సందర్భంగా ప్రారంభించారు.పోరాటాల వారసత్వంమోటూరు ఉదయం గారు ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యమాల్లో అగ్రగామిగా నిలిచారు. విజయవాడ వీధుల్లో సైకిల్‌పై తిరుగుతూ మహిళలను చైతన్యవంతం చేసిన ఆమె శైలి నాటి కాలంలో ఒక సంచలనం. బుర్రకథ వంటి కళారూపాల ద్వారా ఫాసిజంపై, సామాజిక రుగ్మతలపై ఆమె చేసిన పోరాటం మరువలేనిది. 2002 మార్చి 31న ఆమె మరణించగా, నేడు ఆమె వర్ధంతి వేళ ఈ హాలు ప్రారంభం కావడం విశేషం.సూర్యవతి హాలు ప్రత్యేకత వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన ఈ హాలు కేవలం ఒక భవనం మాత్రమే కాదని, రాబోయే తరాలకు మహిళా పోరాటాల స్ఫూర్తిని అందించే వేదిక అని వక్తలు కొనియాడారు. మానికొండ సూర్యవతి గారు మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, ఎమ్మెల్సీగా ప్రజా సేవలో నిమగ్నమై, నిరుపేద మహిళల అభ్యున్నతికి కృషి చేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు కమ్యూనిస్ట్ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మోటూరు ఉదయం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మహిళల రాజకీయ చైతన్యం, సామాజిక రక్షణ మరియు హక్కుల సాధన కోసం ఈ వేదికను కేంద్రంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు."మహిళల ఆత్మవిశ్వాసానికి చిరునామా మోటూరు ఉదయం అయితే, ప్రజా సేవలో నిబద్ధతకు నిదర్శనం మానికొండ సూర్యవతి. వీరిద్దరి స్ఫూర్తి నేటి యువతకు ఎంతో అవసరం.ఈ కార్యక్రమం విజయవాడ పరిసర ప్రాంతాల్లోని మహిళా లోకంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ హాలు రాబోయే రోజుల్లో సామాజిక చర్చలకు, చైతన్య కార్యక్రమాలకు వేదికగా నిలవనుంది.. కార్యక్రమంలో ఐద్వా రంపచోడవరం జిల్లా నాయకులు ఐ పద్మ, వి ఆర్ పురం ఎటపాక చింతూరు కూనవరం మండల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు





## అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను సందర్శించిన పాటి రాంబాబు



గోకవరం-నేటిసుబోదయ. :గోకవరం మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామం గంగాభవాని నగర్ లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకి ళ్ళు దగ్ధమయ్యాయి.గ్రామానికి చెందిన కుంజాల శ్రీను, కుటేటి సింహాద్రి లకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి ఆ య్యాయి.అగ్ని ప్రమాదంలో సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.అగ్ని ప్రమాద బాధితులలో లావణ్య బాలిక పదవ తరగతి పరీక్షలు రాస్తున్నందున ఆమెకు సంబంధించిన హాల్ టికెట్ కూడా అగ్నికి ఆహుతి అయింది. సంఘటన స్థలాన్ని గోకవరం మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాటి రాంబాబు సందర్శించి బాధితులకు కొంత నగదును అందజేశారు.ఈ కార్యక్రమం వైసీపీ నాయకులు పాటి అప్పలరాజు, పాలిక రేవత్ కుమార్,గంటా బులి వేంకటేసులు,కాకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి మారుపేరు యలమందల జగదీష్

**-ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మానవత్వానికి మారుపేరుగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నిలిచారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం, 1వ డివిజన్ లో మంగళవారం బోద నాగేశ్వరరావు (చిన్న), బోద ఉమ అనారోగ్యంతో మరణించి అనాదలుగా మిగిలిన ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి, అదేవిధంగా కొడుకు చనిపోయి అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి, ఇరువురి కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యం, కొంత ధన రూపంలో ఆర్థికసాయం అందించి జగదీష్ మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ పేదవారికి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం

**-విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ**



విజయవాడ, మార్చి 31 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఒక గొప్ప వరమని, ఆపదలో ఉన్న వారికి ఈ నిధి కొండంత అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన ఇరువురు లబ్ధిదారులకు ఎల్.ఓ.సి పత్రాలను అందజేశారు.బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన జువ్వనపూడి ఆరోగ్యమ్మకు రూ. 76,802, అలాగే విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన బేతపూడి పాపకు రూ. 1,34,428 విలువైన వైద్య సహాయం మంజూరైంది. ఈ మేరకు సంబంధిత పత్రాలను ఆయన స్వయంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆపద సమయంలో వైద్య ఖర్చులు భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సత్వరమే నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందని అన్నారు.

# నేతన్నల కుటుంబాల్లో వెలుగులు

## గన్నవరం అభివృద్ధిపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కీలక భేటీ.

**-హైదరాబాద్‌కు చెందిన సైంటిఫిక్ బృందంతో నియోజకవర్గ అభివృద్ధిపై చర్చలు**

**-గన్నవరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే యార్లగడ్డ.**

**ఆధునిక సాంకేతికతతో ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు : యార్లగడ్డ**



విజయవాడ, మార్చి 31 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గన్నవరం నియోజకవర్గాన్ని ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సైంటిఫిక్ బృందం తో ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నియోజకవర్గ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రణాళికలపై ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావును హైదరాబాద్ నుండి వచ్చిన సైంటిఫిక్ బృందం విజయవాడలోని కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎదురవుతున్న సమస్యలను వివరంగా పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కార మార్గాలపై సైంటిఫిక్ బృందం సూచనలు అందించింది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలనే దిశగా చర్చలు జరిగాయి. ప్రత్యేకంగా బ్రహ్మ లింగం చెరువు అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఈ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, ఎకో రిసార్ట్ ఏర్పాటు, నేచర్ టూరిజం ప్రోత్సాహం, సోలార్ ఎనర్జీ వినియోగం ద్వారా స్వయం సమృద్ధిగా మార్చే అంశాలపై బృందం ప్రణాళికలు వివరించింది. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా, పర్యావరణానికి అనుకూలంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే నియోజకవర్గంలో అమలు చేయగలిగే ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా గుర్తించి, వాటిని దశల వారీగా అమలు చేస్తామని తెలిపారు. మొదటి దశలో అత్యవసర ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు, తదుపరి రెండో, మూడో దశల్లో మిగిలిన ప్రణాళికలను కూడా గుర్తించి అమలు చేస్తామని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటామని, సైంటిఫిక్ బృందంతో ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జడ్పీ సీఈవో



మచిలీపట్నం, మార్చి 31 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కృష్ణా జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న జే.అరుణ ను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నూతన సి. ఇ. ఓ. అరుణ మర్యాద పూర్వకంగా కలిశారు.

## బాణసంచా ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ, మార్చి 31( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్లో జరిగిన బాణాసంచా ప్రమాద బాధితులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు.ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాల పట్ల మంత్రి విచారంవ్యక్తం చేసారు.మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారుబాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారుమెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డాక్టర్లకు సూచించారు.ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం





అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దీపావళి సమయంలో అక్రమ వ్యాపారం చేసిన వారివద్ద స్వాధీనం చేసుకున్న టపాసులను తరలిస్తున్న సమయంలో ప్రమాదం సంభావించిందన్నారు. ముగ్గురు కూడా డాక్టర్ల పరిశీలనలో ఉన్నారని, మెరుగైన వైద్యం అందుతోందన్నారు.ప్రభుత్వం నుండి రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.స్పందించిన హోమ్ మంత్రి అనిత కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీసుస్టేషన్ లో పేలుడు ఘటనపై స్పందించి జిల్లా ఎస్. పి. తో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.ాాఖుఅు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ బాధితులను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అందరు త్వరగా కోలుకోవాలని అన్నారు.

## పేదరిక నిర్మూలనకు పి 4 దోహదం

**గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో పి 4 మొదటి వార్షికోత్సవాలు.**



గుడివాడ మార్చి 31, ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) సమాజంలో పేదరికం నిర్మూలనకు పి4 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందనీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సమాజంలో అందరూ సమానంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గుడివాడ పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో పి...4( పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ ) మొదటి వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, పి ఫోర్ సభ్యులతో పలు అంశాలపై ఎమ్మెల్యేలను



మాట్లాడారు. పి 4ద్వారా మార్గదర్శిలు బంగారు కుటుంబాలను లోతుగా అధ్యయనం చేసి వారికి కావలసిన సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ సమాజంలో ఉన్న పేద ప్రజలకు పాఠశాల, కళాశాల ఫీజులు చెల్లింపు, తదితర ఏదో రకమైన సహాయంఅందించి ఆదుకోవాలన్నారు.ఇతరులకు సహాయం చేయాలంటే పెద్ద వ్యాపారవేత్తలు కావలసిన అవసరం లేదని మనసున్న మనిషిగా ఉంటే చాలని స్పష్టం చేశారు. సమాజానికి మన వంతు బాధ్యతగా ఎంతో కొంత సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ సేవా పురస్కార గ్రహీతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి, పంద్రాజు సాంబయ్య, చేకూరు జగన్మోహన్రావు, గుడివాడ స్పెషల్ ఆఫీసర్ నరసింహులు, కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎండిఓ విష్ణు ప్రసాద్, ప్రొఫెషనల్ మణికంఠ రావు,పి 4 మార్గదర్శిలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు .

## నేతన్నల కుటుంబాల్లో వెలుగులు

**-ఏప్రిల్ ఒకటి నుంచి ఉచిత విద్యుత్ అమలు**

**-మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు**

**మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్**

**-ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు,**

**-మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా**

**-రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు, మినీ కస్టర్ల ఏర్పాటు**

**ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్**

**-పిఠాపురంలో రూ.12 కోట్లు, మంగళగిరిలో**

**రూ.22.35 కోట్లతో ప్రత్యేక హ్యాండ్లూమ్ ప్రాజెక్టుల ఏర్పాటు**

**-చేనేత సహకార సంఘాలకు బకాయిల చెల్లింపులు**

**-త్వరలో నేతన్న భరోసా పథకానికి శ్రీకారం**

**-ఆప్కోలో డిజిలైజేషన్ కు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు**

**-నేతన్నల గౌరవప్రద జీవనమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



అమరావతి, మార్చి 31( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. నేతన్నలకు వ్యక్తిగత లబ్ది కలిగించేలా ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరో పరిశ్రమ అభివృద్ధికి పాలసీలు తీసుకొస్తోంది. ఆనాడు అన్న ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో చేనేత రంగానికి అండగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తూ వస్తున్నారు. నూతన టెక్స్ టైల్స్ పాలసీలు అమలు చేయడం, మెగా క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు నేతన్నలకు వ్యక్తిగత లబ్ది కలిగేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షా నాలుగు వేల చేనేతల కుటుంబాలకు మేలు కలిగే ఉచిత విద్యుత్ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ పథకం ద్వారా ఏటా రూ.150 కోట్ల భారం ప్రభుత్వంపై పడనుంది.

### కూటమి రాకతో చేనేతకు మహర్దశ

జగన్ ప్రభుత్వ తీరుతో పూర్తిగా నిర్వీర్యమైపోయిన చేనేత రంగానికి 2024లో సీఎం చంద్రబాబు ఏర్పాటుతో మహర్దశ ప్రారంభమైంది. నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద ప్రతి బడ్జెట్ లోనూ రూ.5 కోట్లు చొప్పున్న కేటాయిస్తూ వస్తున్నారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు. స్మాల్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.డి.పి.) కింద 10 చిన్న క్లస్టర్లను మంజూరు చేశారు. 15 శాతం రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నారు. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందజేశారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించాం. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం కింద చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నాం. గత వైసీపీ ప్రభుత్వం కంటే అదనంగా రూ.వెయ్యిలు ఇవ్వనున్నారు. చీరాలలో నేతన్నల ఆదాయంతో పాటు చేనేత ఉత్పత్తుల పెంపుదలకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) రూ.4.17 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి.పి)లో భాగంగా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నారు. పిఠాపురంలో రూ.12 కోట్లు, మంగళగిరిలో రూ.22.35 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టుల ఏర్పాటు చేయబోతున్నారు. రాష్ట్రంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.సి.డి.పి)లో భాగంగా రూ.10.44 కోట్లతో పది క్లస్టర్లను మంజూరయ్యాయి. సహాయక క్లస్టర్లతో పాటు ఇతర క్లస్టర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ, నెట్ ఫండ్ అందజేస్తూ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నారు. పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో అందజేస్తున్నారు.

### అవార్డుల వెల్లువ

కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏపీ చేనేత రంగం అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' పథకం కింద రాష్ట్రానికి వచ్చిన 10 అవార్డులలో 4 అవార్డులు చేనేత రంగానికే దక్కడం విశేషం. ఆప్కోలో డిజిటలైజేషన్ చేపట్టినందుకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది. ఫోన్ పే ద్వారా వస్త్రాలు కొనుగోలు, విధుల్లో పారదర్శకతకు ముఖాధారిత హాజరు, కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్ వంటి ఎన్నో సాంకేతికతను ప్రవేశపెట్టాం. ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారు. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటిలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం స్కోచ్ అవార్డు ప్రకటించింది.

### ఉచిత విద్యుత్ నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి

నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుడుతోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నాం. ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుంది. 1, 04,000 మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి. ఈ పథకం అమలైతే నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనడంలో సందేహం లేదు.

### నేతన్నలకు గౌరవప్రద జీవనమే లక్ష్యం

గత ప్రభుత్వ తీరు వల్ల ఆప్కో నష్టాల్లో కూరుకుపోయింది. ఆప్కో పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.120 కోట్లను గత ప్రభుత్వం తీసుకొచ్చి, పక్కదారి పట్టించింది. దీనివల్ల ఆప్కో సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఆప్కోను గాడిలో పెడుతున్నాం. చేనేత సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నాం. చేనేత వస్త్రాలపై ఆప్కో, చేనేత సంఘాలకు జీఎస్టీ మినహాయింపు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహించి 40 శాతం, 50 శాతం డిస్కౌంట్లలో చేనేత ఉత్పత్తులు విక్రయిస్తున్నామని, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆప్కో షో రూమ్ ల్లో అమ్మకాలు పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేనేత వస్త్రాలను ధరిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి పండుగకు, వారానికోసారి రాష్ట్ర ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు తోడ్పడాలని పిలుపునిస్తున్నారు. ఉచిత విద్యుత్ నేతన్నలకు మరింత ఆర్థిక దన్ను లభించనుంది. మా కూటమి ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.చేనేత కుటుంబాలు గౌరవమైన, ఆర్థిక భరోసాతో కూడిన జీవనం సాగించడం. ఇందుకోసం ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



## దిగ్విజయంగా జరుగుతున్న వెనిగండ్ల ప్రీమియర్ లీగ్..క్రికెట్ పోటీలు

**-రెండో రౌండ్ పోటీల్లో ఘన విజయం సాధించిన శ్యాం బాబాయ్ సిసి టీం**

**-మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న లోకేశ్ టీం సభ్యులను అభినందించిన కెప్టెన్ శ్యామ్, మెంటర్ కడియాల గణేష్**



గుడివాడ, మార్చి 31( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు దిగ్విజయంగా దూసుకుపోతున్నాయి. పోటీల్లో శ్యాం బాబాయ్ సిసి జట్టు విజయ దుందుభి మోగించింది. సాంబయ్య సిసి గుడివాడ పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. పోటీల్లో అత్యధిక పరుగులు సాధించిన లోకేష్ కు సీనియర్ టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, తెలుగు యువత నాయకుడు పంచకర్ల మహేష్ మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు అందించారు. టీం ఘనవిజయం సాధించడం పట్ల కెప్టెన్ శ్యామ్, మెంటర్ కడియాల గణేష్ హర్షం వ్యక్తం చేశారు. నిత్యజీవితంలో వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో బిజీగా ఉన్న జట్టు సభ్యులు ఆహ్లాదం కోసం పోటీల్లో పాల్గొన్న చక్కటి పోరాట పటిమతో పటిష్ట జట్లను ఓడించడం పట్ల టీమ్ మెంటర్ కడియాల గణేష్ జట్టు సభ్యులను అభినందించారు. రానున్న మ్యాచుల్లో సమిష్టిగా ఆడుతూ మరిన్ని విజయాలు సాధిస్తామని కెప్టెన్ శ్యామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.పోటీలు విజయవంతానికి సహకరిస్తున్న క్రీడాకారులు, స్టేడియం కమిటీ సిబ్బంది, ప్రేక్షకులకు,వేనిగండ్ల ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



## స్వచ్ఛ సర్వేక్షన్ లో విజయవాడ తో పాటు మెంటీ సిటీలు కూడా ముందంజలో ఉండాలి డాక్టర్ జి.లక్ష్మీశ




విజయవాడ, మార్చి 31 (నేటి శుభోదయ):- స్వచ్ఛ సర్వేక్షన్ లో విజయవాడ నగర పాలక సంస్థతోపాటు మెంటీ సిటీలు కూడా ముందంజలో ఉండాలని స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీశ అన్నారు. మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీశ మాట్లాడుతూ సూపర్ స్వచ్ లీగ్ సిటీ గా ఉన్న విజయవాడ నగరపాలక సంస్థ, ఆ అవార్డును అలాగే నిలబెట్టుకోవటమే కాకుండా మెంటీ సిటీలైన ఆకివీడు, సామర్లకోట, చింతలపూడి, నర్సాపురం, గొల్లప్రోలు కూడా ముందంజలో ఉంచాలని, అందుకు వారికి సహకారం అందించి విజయవాడ నగరపాలక సంస్థ వారు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను వారి మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కూడా వాళ్ళు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విజయవాడ నగరంలో కూడా వినూత్న క్యాంపెయిన్లు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై మరింత అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్)డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ వర్క్స్ వి చంద్రశేఖర్, స్వచ్ఛ సర్వేక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షతగాత్రులైన సిబ్బందిని పరామర్శించిన కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**ప్రమాదంపై సమగ్ర విచారణ**



విజయవాడ, మార్చి 31 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన పోలీసు సిబ్బందిని కృష్ణాజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను స్వయంగా పరిశీలించి, ప్రమాదానికి దారి తీసిన కారణాలను తెలుసుకున్నారు.ఇటీవల చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా విక్రయిదారులు, తయారీదారులు అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచా పదార్థాలను సీజ్ చేసి, కోర్టు ఉత్తర్వుల మేరకు డిస్పోస్ చేసే క్రమంలో చల్లపల్లి పోలీస్ స్టేషన్ వెనుక వైపు గల పాడుబడిన బాత్రూం సెడ్ నుండి బాణసంచాను తీసుకొస్తున్న నేపథ్యంలో అట్ట పెట్టి అడుగుభాగం ఒక్కసారిగా ఓపెన్ కావడంతో అందులో ఉన్న బాణసంచా కిందపడి పేలడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అక్కడ విధుల్లో ఉన్న ఎస్సై దుర్గ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ తేజ, కానిస్టేబుల్ అబ్దుల్లా, డ్రైవర్ నాగరాజు సహా ఇతర సిబ్బంది గాయపడ్డారు.ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, పరిస్థితులను సమీక్షించారు. ప్రమాదానికి కారణాలపై సవివరంగా విచారణ జరిపి, అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి సమాచారం సేకరించారు.అనంతరం గాయపడిన సిబ్బందికి చల్లపల్లిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఎన్. ఆర్. ఐ. ఆసుపత్రికి తరలించారు. ఎన్. ఆర్. ఐ. ఆసుపత్రి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న సిబ్బందిని ఏలూరు రేంజ్ ఐజీపీ జి.వి.జి.అశోక్ కుమార్, ఎస్పీ గాయపడిన సిబ్బందిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు.సిబ్బందిని మినిస్టర్ కొల్లు రవీంద్ర ఇన్చార్జి మినిస్టర్ వాసంశెట్టి సుభాష్ పరామర్శించి వారి ఆరోగ్య సిద్ధిపతులగు వచ్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సహకారం కోసం డిఎంహెచ్వో వారిని ఆస్పత్రికి పంపడం జరిగింది.సిబ్బంది కుటుంబ సభ్యులతో మాట్లాడి, “మీకు అండగా మేమున్నాం, దిగులు పడవద్దు. మెరుగైన వైద్యం అందించడం పోలీస్ శాఖ బాధ్యత” అని భరోసా ఇచ్చారు. అలాగే వైద్యం అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి గాయాల తీవ్రత, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. సిబ్బంది యొక్క కుటుంబ సభ్యులకు సహకారం అందించడానికి ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అన్ని పోలీస్ స్టేషన్లలో సీజ్ చేసిన ప్రమాదకర పదార్థాల నిల్వ, తరలింపు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కాలుష్యాన్ని తగ్గించేందుకు మిస్ట్ వెహికల్స్



విజయవాడ, మార్చి 31 (నేటి శుభోదయ):- కాలుష్యాన్ని తగ్గించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ 6 మిస్ట్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చిందని, విజయవాడ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయంలో మిస్ట వాహనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ కాలుష్యాన్ని తగ్గించేందుకు, వాయు నాణ్యతను పెంచేందుకు మిస్ట్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తుందని అన్నారు. నగర పరిధిలో గల ప్రధాన కూడల్లో ఎక్కడైతే కాలుష్యానికి ఎక్కువగా అవకాశం ఉంటుందో అక్కడ ప్రతిరోజు ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చి కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం విజయవాడ దగ్గర పలక సంస్థ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి సూపరిండెంటింగ్ ఇంజనీర్ వర్క్స్ వి చంద్రశేఖర్, బయాలజీ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నందివాహనంపై శ్రీ గంగా, పార్వతీ(దుర్గా)సమేత మల్లేశ్వరులు



విజయవాడ, మార్చి 31 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై శ్రీగంగా, పార్వతీ(దుర్గా)సమేత మల్లేశ్వరుల చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడవ రోజైన మంగళవారం ఉదయం 8 గంటల నుండి పండితులు మూల మంత్రహవనములు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవ వాహన సేవల్లో భాగంగా సాయంత్రం 5 గంటల నుండి - మల్లేశ్వర మహామండపం నుండి శ్రీ గంగా, పార్వతీ(దుర్గా) సమేత మల్లేశ్వరుల నందివాహనసేవ ప్రారంభం అయింది.నంది (నందీశ్వరుడు) శివుని వాహనం. శివుని సేవకుడిగా, కైలాస లోక సేనలకు అధిపతి. నంది శిరాదుడు అనే రుషి కుమారుడు. శిరాదుడు చేసిన యజ్ఞం నుండి వజ్రాలతో తయారు చేసిన కవచంతో నంది జన్మించాడు. నందీశ్వరుడు గొప్ప సద్గుణాలతో పెరుగుతూ ఉండగా, ఒకరోజు నారదుడు వచ్చి ఈ బాలుడు అల్పాయుష్కుడు అని చెప్పగా, శివుని అనుగ్రహం కోసం నంది ఘోర తపస్సు చేసి, ఇంకేమీ వద్దని, ఎల్లప్పుడు శివున్ని చూస్తూ, సేవిస్తూ ఉండాలనే వరం కోరాడు. శివానుగ్రహంతో నందీశ్వరుడు పూర్ణాయిష్కుడయ్యాడు. శివకుటుంబం లో ఒకడై, శివాలయాలలో గర్భగుడి వైపు కూర్చున్న నంది జీవాత్మ, మనస్సు ఎల్లప్పుడూ శివునిపై దృష్టి పెట్టాలి అనే సందేశాన్ని సూచిస్తుంది. నంది సంపూర్ణంగా తన మనస్సును శివుడికి అంకితం చేసింది. ఇలా ప్రఖ్యాతిగాంచిన నంది వాహనంపై అమ్మవార్లు, స్వామి కొలువై ఉండగా, సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళా కోలాట నృత్యములు, చిన్నారుల కోలాట ప్రదర్శన,తాళం భజన కళాకారుల ప్రదర్శలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నంది వాహనసేవ ప్రారంభం అయింది. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్, స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాసశాస్త్రి ప్రారంభపూజల్లో పాల్గొన్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈ.ఓ వి.కె.శీనానాయక్ ఆది దంపతుల వాహనం ముందు డప్పులు వాయించి, నీరాజనం సమర్పించారు. నంది వాహనం ఊరేగింపు కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ బజార్ మీదుగా కొనసాగింది. ఆది దంపతులు వేంచేసిన నందివాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం

## మానవత విజయవాడ శాఖ లక్ష్యం




విజయవాడ, మార్చి 31 (నేటి శుభోదయ):- మానవత విజయవాడ శాఖ వారు గవర్నర్ పేటలోని ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆఫీస్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి దావులూరి సాంబశివరావు ఈ నెలలో జరిగిన సేవా కార్యక్రమాలను గురించి నివేదిక ను సమర్పించారు. సెంట్రల్ కమిటీ వారికి సమర్పించాల్సిన ఆడిట్ నివేదిక గురించి వివరించారు. అలాగే మన జిల్లాలోని హై స్కూల్స్ అన్నింటిలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికి మన సంస్థ తరపున మోమెంటో, సర్టిఫికేట్, నగదు బహుమతిని అందజేస్తామని, పేద విద్యార్థులకు ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని అన్నారు. మానవత విజయవాడ శాఖ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ వేమూరు బాబురావు ప్రసంగిస్తూ క్రొత్త సభ్యత్వాల నమోదు గురించి సభ్యులందరూ కృషి చేయాలని, సభ్యత్వ నమోదులో మానవత విజయవాడ శాఖ ముందుండాలని అనేక సామాజిక సేవలను చేయాలంటే సభ్యత్వ నమోదు ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. మానవత విజయవాడ శాఖ అధ్యక్షులు పగిడిపల్లి రాము మాట్లాడుతూ తమ సంస్థ తరపున కులమతాలకు అతీతంగా నిరుపేదలందరికీ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని, అలాగే పేద విద్యార్థుల చదువు కోసం, వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని, ప్రమాదవశాతు ఇల్లు కూలిపోయిన, కాలిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేస్తున్నామని అన్నారు. అల్పాహారాన్ని అందజేసిన అట్లూరి త్రిపుర సుందర రావు కు మానవత విజయవాడ శాఖ తరపున హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి. శ్రీరంగం శ్రీనివాసరావు, పి. మధుసూదన రావు, ఎమ్. వెంకటేశ్వరరావు, కె. బాబు రాజేంద్ర ప్రసాద్, కె.వి. దుర్గా ప్రసాద్ (ట్రెజర్), మొవ్వ శైలజ, కొడాలి శాంతి, నాదెళ్ల సుమతి, సుంకర సుభాష్ చంద్రబోస్, ఎమ్. జె. ఎస్. ప్రకాష్ (దూరదర్శన్), మానవత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు పోతున్న

## యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

పెద్దవడుగూరులో అంత్యక్రియల కార్యక్రమం చేసిన ఫౌండేషన్ సభ్యులు



యాడికి మార్చి 31 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :పెద్దవడుగూరు మండల కేంద్రంలోని చిన్నవడుగూరు దారిలో గల కొత్త రూములలో నివసిస్తున్న మంగళ కంబక్క (86) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మృతురాలకి కూతురు మాత్రమే ఉండడం చేత అంత్యక్రియలు చేయడానికి బంధువులు ఎవరు లేకపోవడంతో ఆమె కూతురు కొడుకు యాడికి గ్రామానికి చెందిన కోత్తకోట రామకృష్ణ యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారిని అంత్యక్రియలు చేయాలని కోరడం జరిగింది. విషయం తెలుసుకున్న మే ఐ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు యాడికి నుంచి పెద్దవడుగూరు గ్రామానికి వెళ్లి మృతురాలు కంబక్క అంత్యక్రియలను వారి సంప్రదాయ పద్ధతిలో పూర్తి చేయడం జరిగింది. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో బంధువులు ఎవరూ లేకపోవడం ఎవరు అంత్యక్రియలు పూర్తి చేస్తారు అని ఆలోచన లేకుండా అన్ని మీరే అయ్యి అంత్యక్రియలు పూర్తి చేసినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉందని కంబక్క చెల్లెళ్లు ,కూతురు యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి తెలపడం జరిగింది. ఈ సేవా కార్యక్రమాలు నచ్చి యాడికి గ్రామం కోట వీధికి చెందిన ఆడవల యుగంధర్ కొత్తగా యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ లోకి జాయిన్ కావడం జరిగిందని ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ తెలియజేశారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, సాయి వరకు నాగరాజు, కావల సుధాకర్ (వెంకటాం పల్లి), టి లక్ష్మీకాంతమ్మ, ఆడవల యుగంధర్ పాల్గొనడం జరిగింది.

## మన పెద్దవారి గుర్తుగా సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజానికి మంచి చేయడం హర్షనీయం

**: మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్**



విజయవాడ, మార్చి 31 (నేటి శుభోదయ):- ఇటీవల స్వర్గస్తులైన పాముల పాప ఆదరణ కూడిక సందర్భంగా ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. పాప చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవికాలంలో చలివేంద్రాల ద్వారా ప్రజలకు మంచినీటిని అందించడం ఆనందదాయకమని, మన పెద్దవారి గుర్తుగా ఈ విధంగా సేవా కార్యక్రమాలు చేస్తూ పదిమందికి ఉపయోగపడటం మంచి పరిణామం అనీ, ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తోట్లవల్లూరు మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం, తెదేపా సీనియర్ నాయకులు గుడపాటి గిరిబాబు, ఎస్సీ సెల్ నాయకులు చింతలపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించిన బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఐఏఎస్, బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్

**గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఐఏఎస్**




బాపట్ల నేటి శుభోదయ మార్చ్ 31 :ప్రస్తుతం గుర్తించిన 74 హాట్ స్పాట్ లలో పోలీసుల నిఘా ఉంచాం డ్రగ్స్ రహిత సమాజం కొరకు అధికారులు నిరంతరం కృషి చెయ్యాలిజిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఐఏఎస్, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ గార్లు మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. "డ్రగ్స్ వద్దు, ఈగల్ క్లబ్స్ అంటూ అధికారులు రూపొందించిన ప్రత్యేక ప్రచార బోర్డులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి విడుదల చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్ల ను చేయాలని కలెక్టర్ సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగాలు ఎట్టి పరిస్థితిలో జరగడానికి వీలు లేదన్నారు. మత్తు పదార్థాలను సమూలంగా అరికట్టాలన్నారు. ఈగల్ క్లబ్స్ మాదిరిగా 100 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా వెబ్ సైట్ రూపొందించి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. తద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. అవగాహన కార్యక్రమాలు, యువతను చైతన్య పరచడంతోనే మాదకద్రవ్యాలను నియంత్రించగలమన్నారు. మంచి సమాజ నిర్మాణం కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాపట్ల రైల్వే స్టేషన్ మీదుగా 120 రైళ్లు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ప్రతిరోజు రైల్వే, బస్సు స్టేషన్లలో నిఘా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి బ్లాక్ స్పాట్ లుగా గుర్తించిన ప్రాంతాలలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత ప్రభావితం గాకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్యంతో పోలీసు అధికారులు సమర్థంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కొరకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. శక్తి బృందాలు, ఈగల్ బృందాలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. మొదటి విడతలో చేపట్టిన అవగాహన ప్రచార కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఇదే మాదిరిగా రెండో విడతలోను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందు కొరకు సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టడానికి విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు ఆర్ పి ఎఫ్, రవాణా శాఖ వంటి అనుబంధ శాఖల అధికారులు తమ సహకారం అందించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ సమయంలో సచివాలయాల స్థాయి వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా పోలీసులు గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలతోనే గంజాయి, మాదకద్రవ్యాల భారిన పడకుండా ప్రజలను కాపాడవచ్చన్నారు. గంజాయి ప్రభావానికి యువత గురికాకుండా కళాశాలలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం గుర్తించిన 74 హాట్ స్పాట్ లలో పోలీసుల నిఘా ఉంచామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ఏదైనా అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల డీఎస్పీలు పి.జగదీష్ నాయక్, ఎండి.మోయిన్, చీరాల ఆర్డీవో టి చంద్రశేఖర్, ఈగల్ సెల్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఏపీకి పంచాయితీ రాజ్, గ్రామీణా అభివృద్ధి శాఖ కు ఐదు జాతీయ అవార్డులు

**-సుపరిపాలన ఫలితమేనన్న సీఎం**

అమరావతి, మార్చి 31( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన నేషనల్ పంచాయత్ అవార్డ్స్2025లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐదు ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించింది. గ్రామీణ పాలన, అభివృద్ధి రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతికి ఇది నిదర్శనం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కింద అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శృంగవరం గ్రామపంచాయతీ సుపరిపాలన విభాగంలో మొదటి స్థానం సాధించింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసం పాలెం మహిళా స్నేహపూర్వక పంచాయతీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముల్లపల్లి పేదరిక నిర్మూలన-జీవనోపాధి విభాగంలో రెండో స్థానం సాధించగా, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమాల మౌలిక సదుపాయాల విభాగంలో మూడో స్థానం పొందింది. అదనంగా, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కింద చిత్తూరు జిల్లా కుప్పం మండలం సమగ్ర అభివృద్ధి విభాగంలో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించింది. ఇతర విభాగాల్లో కూడా రాష్ట్ర పంచాయతీలు మంచి ప్రతిభ కనబరిచాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దోనివానిలక్ష్మీపురం గ్రామపంచాయతీ చైల్డ్ ఫ్రెండ్లీ విభాగంలో షార్ట్‌లిస్ట్ కాగా, అనంతపురం జిల్లా గూటి మండలం లచ్చెనపల్లి క్లీన్ & గ్రీన్ విభాగంలో పరిశీలనకు వచ్చింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాఖను అభినందించారు. గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. గత 21 నెలలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సుపరిపాలన, సంస్కరణల ఫలితంగానే ఈ అవార్డులు సాధ్యమయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను ముందుకు నడిపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ , ఇతర అధికారులను, సిబ్బందిని సీఎం అభినందించారు. భవిష్యత్తులో కూడా గ్రామ స్వరాజ్య లక్ష్య సాధనలో రాష్ట్రం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నా ఫిర్యాదులో వాస్తవం లేదు.

**ధూపాటి తిరుపతిరావు.**




మంగళగిరి మార్చి 31 (నేటి శుభోదయ) :తాను గల్లా శ్రీనివాసరావు అనే వ్యక్తితో పాటు, డీఎస్పీపై ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని బేతపూడి గ్రామానికి చెందిన ధూపాటి తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం మంగళగిరిలో గల ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గల్లా శ్రీనివాసరావు తో తనకు ఉన్నటువంటి భూవివాదాలను పెద్దల సమక్షంలో, పోలీసుల సహకారంతో పరిష్కరించుకోవడం జరిగిందని తెలిపారు. కేవలం భయంతోనే తాను ఇరువురిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. గల్లా శ్రీనివాసరావుకు తనకు ఎటువంటి భూ వివాదాలు లేవని స్పష్టం చేశారు. గల్లా శ్రీనివాసరావు వలన తనకు ప్రాణహాని ఉందంటూ తాను చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆయన వలన తనకు ఏ విధమైన ప్రాణహాని లేదని తెలిపారు. సమస్యను పరిష్కరించిన పోలీసులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు.

### సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు




బాపట్ల నేటి శుభోదయ మార్చ్ 31 :ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన బాపట్ల మండలం సూర్యలంక బీచ్ ముఖచిత్రాన్ని మార్చే విధంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు నేడు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సివిల్ మరియు సుందరీకరణ పనుల నాణ్యతను తనిఖీ చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పర్యాటక శాఖ, రెవెన్యూ, పంచాయితీ రాజ్, ఫారెస్ట్ శాఖల ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైసిపి నాయకులు



పులిచెర్ల, మార్చి 31,(నేటి శుభోదయ) :మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం పులిచెర్ల మండలం నన్నూరు వారి పల్లి పంచాయతీకి చెందిన సర్పంచ్ వాసుదేవరెడ్డి. వైసిపి నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వాసు నువ్వు గ్రేట్ అంటూ ప్రశంసించి. సన్మానించారు. ఎందుకంటే. ఐదు సంవత్సరాల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికలలో. మండలంలోని అన్ని పంచాయతీలు సర్పంచులను. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏకగ్రీవం చేయించారు. అయితే కూటమి పాలన వచ్చిన తర్వాత కొందరు సర్పంచులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హ్యాండిచ్చి. పార్టీ నుంచి జంప్ అయ్యారు కానీ నన్నూరు వారి పల్లి సర్పంచ్ వాసుదేవ రెడ్డి. తనను సర్పంచిగా



ఏకగ్రీవంగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్ల విధేయతతో ఉంటూ పార్టీ మారకుండా వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్పంచిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, మునస్వామి, మునిరత్నం, శ్రీనివాసులు. నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### బాపట్ల పట్టణ ఎస్సై విజయ్ కుమార్ నో హెల్మెట్ -నో ఫ్యూయల్ పై అవగాహన కల్పించటం జరిగినది




బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్)మార్చి 31: బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర గారి ఆదేశాల మేరకు, బాపట్ల పట్టణ సీఐ రాంబాబు గారి ఆధ్వర్యంలో బాపట్ల పట్టణ ఎస్సై విజయ్ కుమార్ వారి సిబ్బంది కలిసి బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది. ఇందులో భాగంగా బాపట్ల ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, వాహనాలు హెల్మెట్ లేకుండా నడపకూడదు అని, అతివేగంగా వాహనాలు నడపకూడదు అని, సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ తో వాహనాన్ని నడపడం వీటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఏప్రిల్ 15 తారీకు వరకు జరుగుతాయని చెప్పడం జరిగింది. అదే విధంగా ఏప్రిల్ 15వ తారీకు తర్వాత బాపట్ల పట్టణంలోని పెట్రోల్ బంకుల నందు "నో హెల్మెట్ -నో ఫ్యూయల్" కార్యక్రమం జరుగుతుందని ఈ విషయమై బాపట్ల జిల్లాలో ప్రతి ఒక్కరు అవేర్నెస్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించడం జరిగింది... ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ ఎస్ హెచ్ ఓ గారి తో పాటు బాపట్ల పట్టణ ఎస్సైలు విజయ్ కుమార్ మరియు బాపట్ల పట్టణ సిబ్బంది మరియు ట్రాఫిక్ స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



పులిచెర్ల, మార్చి 31,(నేటి శుభోదయ) :సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రాథమిక హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ జయసింహ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు ఎస్సీ కాలనీలో మంగళవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకొని సమాజంలో గుర్తింపు పొందాలని అన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల సంరక్షణకు. ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు అనంతరం ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముబారక్ భాషా, గ్రామ రెవెన్యూ అధికారి అజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


## గిరిజన సమస్యలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**- బడ్జెట్ లో నిధుల కోత,**

**ఏజెన్సీ మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలి**

**- పిహెచ్ సి సెంటర్ ను 50 పడకలుగా మార్చాలి**

**- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్**



ఏన్కూర్, నేటి శుభోదయ ::: మండల ముఖ్య కార్యకర్తల సమావేశం భూక్యా లక్మా నాయక్ అధ్యక్షత మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రస్తావించారు.జిల్లాలో సుమారు 4 లక్షల మంది గిరిజనులు ఉన్నప్పటికీ, వారి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఖమ్మంలో ఐటిడిఎ ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఖమ్మం, వైరా నియోజకవర్గ కేంద్రాల్లో మంజూరైన గిరిజన భవనాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద గిరిజన విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రుణాలను విడుదల చేయాలని కోరారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కోసం ఖమ్మంలో ప్రత్యేక ఎంప్లాయిమెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏజెన్సీ మండలాల అభివృద్ధికి బడ్జెట్లో నిధులు తగిన స్థాయిలో కేటాయించ లేదని విమర్శించారు. బడ్జెట్లో ఏజెన్సీ మండల అభివృద్ధి కోసం నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఏన్కూర్ ప్రాథమిక వైద్యశాలను యాభై పడకల ఆసుపత్రి( కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా) మార్చి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.ట్రైకార్ కింద పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే విడుదల చేయాలని, వివిధ గ్రామాల్లో గిరిజనులు పేదలు 50 సంవత్సరాలుగా సాగు చేస్తున్న అసైన్ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి మరింత నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ, బానోత్ గోపి కృష్ణ, బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గిరిజన సంఘం పోరాటాలను మరింత బలోపేతం చేస్తుందని నాయకులు తెలిపారు.

నేటి శుభోదయ

## సంపాదకీయం

# మౌనంగానే మెడలు వంచి!

**అమెరికాతో వాణిజ్య ఒప్పందం వెనక...**
**ఫలించిన మోదీ వేచి చూసే ఎత్తుగడ**
**ఇతర దేశాలతో వరుసగా ఒప్పందాలు**
**దాంతో ట్రంప్‌పై పెరిగిన ఒత్తిడి**
**ఈయూ–భారత్ ఒప్పందంతో బెంబేలు**
**దిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు**

అసలే అతను డొనాల్డ్ ట్రంప్. శత్రువులా, మిత్రులా అన్న తేడా కూడా లేకుండా అన్ని దేశాలనూ హడలెత్తిస్తూ వస్తున్న వ్యక్తి! కఠిన పదజాలంతో కూడిన బెదిరింపులతో, ఎడాపెడా టారిఫ్‌ల బాదుడుతో వణుకు పుట్టించడాన్నే తన నైజంగా మార్చుకున్నారు. రెండోసారి అధికారం చేపట్టింది మొదలు, ఈ ఏడాది కాలంలో ప్రపంచ దేశాలకు ఒకరకంగా పీడకలలా పరిణమించారు. చివరికి దక్షిణ కొరియా, బ్రిటన్ వంటి అతి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ట్రంప్ బెదిరింపులకు జడిసి ఆయన డిమాండ్లకు అనుగుణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ విషయంలో మాత్రం ట్రంప్ హఠాత్తుగా దిగొచ్చిన తీరు ప్రపంచ దేశాలను విస్మయానికి గురి చేస్తోంది. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ఏకంగా 18 శాతానికి తగ్గిస్తున్నట్టు సోమవారం ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దీన్ని భారత్ సాధించిన ఘన విజయంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో తొలినుంచీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గకుండా, మాటల యుద్ధానికి బదులివ్వకుండా సంయమనం పాటిస్తూనే చివరికి మౌనంగానే ఆయన మెడలు వంచారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతోంది. బెదిరింపులనే తిరుగులేని ఆయుధంగా చేసుకుంటూ గత ఏడాది కాలంలో ట్రంప్ చెలరేగి పోయారు. దేశాధినేతలంతా తాను చెప్పినట్టు వినాలన్న ఒంటెత్తు పోకడ ప్రదర్శించారు. చివరికి నోబెల్ శాంతి పురస్కారానికి తాను అర్హుడినంటూ ప్రకటనలు చేయాల్సిందిగా వారిని ఒత్తిడి చేసే స్థాయికీ వెళ్లారు! పాక్ లాంటి పలు దేశాల అధినేతలు అందుకు తలొగ్గారు కూడా. కానీ మోదీ నుంచి మాత్రం మౌనమే సమాధానమైంది. దాంతో ట్రంప్ ఇగో దెబ్బ తిన్నది కూడా. మోదీ వ్యక్తిగతంగా ఫోన్ చేయనందుకే భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ బాహాటంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. ప్రధాని మాత్రం వీటిని పట్టించుకోలేదు. అంతేగాక ట్రంప్ బెదిరింపుల ఉచ్చులో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒప్పందం విషయమై ట్రంప్ నాలుగుసార్లు స్వయంగా ఫోన్ కాల్స్ చేసినా పట్టించుకోలేదు. ఆయన కారాలు, మిరియాలు నూరుతున్నా లక్ష్యపెట్టకుండా బ్రిటన్, న్యూజిలాండ్, అనంతరం ఒమన్‌లతో లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తద్వారా స్వతహాగా వ్యాపారి అయిన ట్రంప్‌నే మించిపోయే స్థాయిలో మోదీ వ్యాపార దక్షత ప్రదర్శించారు. ఈ చర్యతో ఆయనను పునరాలోచనలో పడేశారు. ఇక గత నెలలో యూరోపియన్ యూనియన్‌తో అతి కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్ ఖరారు చేసుకుంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత భారీదని కొనియాడుతున్న ఈ డీల్ భారత్‌పై దూకుడు విషయంలో ట్రంప్‌కు గట్టిగా బ్రేకులు వేసిందని చెబుతున్నారు. 27 దేశాల కూటమి అయిన ఈయూతో కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయ వేదికపై భారత స్థాయిని మరింత పెంచింది. ట్రంప్ చపలచిత్తం పుణ్యమా అని ఇతర దేశాల దృష్టిలో అమెరికా శరవేగంగా విశ్వసనీయతను కోల్పోతూ వస్తోంది. అందుకు విరుద్ధంగా భారత్ మాత్రం అత్యంత నమ్మదగ్గ భాగస్వామ్య దేశంగా తన ప్రతిష్టను పెంచుకుంటూ వచ్చింది. పైగా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌ను ఏ దేశమూ ఇప్పుడు తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఇందుకు అమెరికా కూడా మినహాయింపు కాదు. అందుకే వ్యవసాయ, పాడి తదితర కీలక రంగాలను అమెరికా పరిశ్రమలకు బాహాటంగా తెరిచేందుకు కరాఖండిగా నిరాకరించి కూడా ఒప్పందానికి ట్రంప్‌ను భారత్ ఒప్పించగలిగింది! అదే సమయంలో ట్రంప్ ఎంతగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ప్రతి వ్యాఖ్యలకు దిగకుండా మోదీ పరిణతి ప్రదర్శించారు.

చైనాతో స్నేహ గీతం

ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా వ్యూహాత్మకంగా చైనాకు దగ్గరయ్యేందుకు కూడా భారత్ వెనకాడలేదు. గతేడాది షాంఘై సహకార సమాఖ్య భేటీకి హాజరయ్యేందుకు ఏడేళ్ల అనంతరం మోదీ చైనాలో పర్యటించారు! ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. అవి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. చివరికి ట్రంప్ కూడా వాటిపై చిర్రుబుర్రులాడారు. భారత్, రష్యాలను అమెరికా చివరికి చైనాకు కోల్పోయిందంటూ నిట్టూర్చారు! ఆ తర్వాత రెండు నెలలకే పుతిన్‌కు ఢిల్లీలో మోదీ రాచమర్యాదలు చేశారు. రష్యాతో పలు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. ఇలా పలు అగ్ర రాజ్యాలతో భారత్ వ్యూహాత్మకంగా ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకుంటున్న వైనం కూడా ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది. భారత్ అక్కడితోనే ఆగలేదు. ట్రంప్ టారిఫ్‌లకు ప్రతీకా రంగా తాను కూడా అమెరికాపై సుంకాలు బాదింది! అమెరికా నుంచి దిగుమతయ్యే పప్పులు, తృణధాన్యాలపై ఏకంగా 30 శాతం టారిఫ్‌లు విధించింది. ట్రంప్‌లా గొంతెత్తి ప్రకటనలు చేయకుండా మౌనంగానే గత నవంబర్ నుంచే వాటిని వసూలు చేయడం కూడా ప్రారంభించింది.

'ఒప్పందం'పై మోదీ మౌనం

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయిందని ట్రంప్ ప్రకటించినా, దానిపై మోదీ మాత్రం సూటిగా స్పందించకపోవడం విశేషం. అంతేగాక రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ ఒప్పుకుందని, అమెరికా నుంచి దిగుమతులను ఏకంగా 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లనుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మోదీ మౌనమే వహించారు. కేవలం టారిఫ్‌ల తగ్గింపుకు హర్షం వ్యక్తం చేయడానికే తన స్పందనను పరిమితం చేయడం గమనార్హం.

'గోర్' ఫ్యాక్టర్


సెర్గియో గోర్. భారత్‌లో అమెరికా నూతన రాయబారి. భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు వెనక ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. ఇరు దేశాల సంబంధాలు కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా దిగజారిన తరుణంలో గత జనవరి 12న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఎన్నడూ లేనంత బలోపేతం చేయడమే ఆ సందర్భంగా స్పష్టంగా ప్రకటించారు. 'నిజమైన మిత్రులు తొలుత విభేదించవచ్చు. కానీ అంతిమంగా ఒక్కతాటిపైకే వస్తారు' అని చెప్పుకొచ్చారు. అమెరికాకు భారత్ కంటే ముఖ్యమైన దేశం మరేదీ లేదని కూడా స్పష్టం చేశారు. ఖనిజాల అన్వేషణ, ఏఐ టెక్నాలజీ వాడకానికి సంబంధించి అమెరికా ఏర్పాటు చేసిన 'పాక్స్ సిలికా' కూటమిలో చేరాల్సిందిగా భారత్‌ను ఆహ్వానించారు కూడా. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సుదీర్ఘ ప్రతిష్టంభన కాస్తా ఆయన వచ్చిన మూడు వారాల్లోపే వీడిపోవడం విశేషం. ట్రంప్‌కు అత్యంత సన్నిహితునిగా గోర్‌కు పేరుంది. ఏ సందర్భంలోనైనా గోర్‌ను తాను పూర్తిగా విశ్వసిస్తానని ట్రంప్ చెబుతుంటారు. భారత్‌తో ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు విషయంలో ట్రంప్‌పై ఆయన ప్రభావం చాలా ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మాకు సమాచారం లేదు: రష్యా

మాస్కో: చమురు కొనుగోళ్ల నిలిపి వేతపై భారత్ నుంచి ఇప్పటి దాకా అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదని రష్యా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. ఇకపై వెనెజువెలా నుంచే భారత్ అధికంగా చమురు కొనుగోలు చేస్తుందని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ట్రంప్ వ్యాఖ్య లను నిశితంగా పరిశీలి స్తున్నట్టు రష్యా ఇంధన రంగ వ్యవహారాలు చూసే ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ చెప్పారు. భారత రిఫైనరీల నుంచి ఒప్పందాల రద్దు దిశగా ఎలాంటి నోటీసులూ అందలేదని రష్యా ఇంధన శాఖ వర్గాలు కూడా స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ భారీగా పెంచుకోవడం తెలిసిందే. ఆ దేశం నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశంగా కూడా నిలిచింది. దీనిపై అమెరికాతో పాటు యూరప్ దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయని సంగతి తెలిసిందే.

# అంతరిక్ష సంక్షేమం కోసం స్టార్‌గేజ్

**ఉపగ్రహాలు ఢీకొట్టకుండా అప్రమత్తం చేయనున్న వ్యవస్థ**
**వేల ఉపగ్రహాల తాజా లొకేషన్ ఉచితంగా షేరింగ్**
**కొత్తగా అందుబాటులోకి తెచ్చిన స్పేస్‌ఎక్స్**



ఇతరుల బాగు కోరే వారే మంచి మనిషి అని శతాబ్దాలుగా వింటున్నాం. ఇప్పుడీ మంచి పనిని అంతరిక్ష వేదిగా ఆచరించి చూపుతా మని ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' సంస్థ శనివారం ప్రకటించింది. అంతరిక్షంలో వందల కిలోమీటర్ల ఎత్తులో వేర్వేరు కక్ష్యల్లో తిరిగే కృత్రిమ ఉపగ్రహాలు హఠాత్తుగా స్థానచలనం చెందిన విపత్కర సందర్భాల్లో సమీప ఉపగ్రహాల ఆపరేటర్లను అప్రమత్తంచేసే అత్యాధునిక ఆన్‌లైన్ టూల్ 'స్టార్‌గేజ్'ను అందుబాటులోకి తెచ్చినట్లుస్పేస్‌ఎక్స్ ప్రకటించింది. దీనిని స్పేస్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ సిస్టమ్ అని కూడా పిలుస్తున్నారు.

### ఏమిటీ స్టార్‌గేజ్?

ఇదొక అప్రమత్త వ్యవస్థ. ఉపగ్రహాల ఇంధనం ఖాళీ అవడం, లేదా ఉపగ్రహం విఫలమై దిగువ కక్ష్యలోకి జారిపోవడం లేదా స్వేచ్ఛగా ఇష్టమొచ్చినట్లు తిరిగే సందర్భాల్లో అవి అంతరిక్ష బాంబుల్లా మారిపోతాయి. సమీప ఉపగ్రహాలకు ఢీకొట్టి సర్వనాశనం చేస్తాయి. తర్వాత ఇది శృంఖల చర్యలా విశృంఖలంగా జరిగి వందల ఉపగ్రహాలు ధ్వంసమయ్యే పెను ప్రమాదముంది. ఈ అంతరిక్ష ప్రమాదాన్ని మొగ్గదశలోనే తుంచేసే శక్తి ఈ స్టార్‌గేజ్‌కు ఉంది. అస్తవ్యస్తంగా కదులుతున్న ఉపగ్రహాల జాడ, లొకేషన్‌ను ఇతర ఆపరేటర్లకు ఉచితంగా స్పేస్‌ఎక్స్ అందిస్తుంది. దాంతో తమ ఉపగ్రహాలను ఆ ప్రమాదకర ఉపగ్రహం నుంచి దూరంగా తీసుకెళ్లడమో, దిగువ కక్ష్యలోకి సురక్షితంగా మార్చడమో సాధ్యమవుతుంది. దీంతో ఉపగ్రహాల యాక్సిడెంట్‌ను నివారించవచ్చు. కేవలం ఉపగ్రహాలు మాత్రమేకాకుండా హఠాత్తుగా దూసుకొచ్చిన చిన్నపాటి గ్రహశకలాల లొకేషన్‌నూ ఆపరేటర్లకు స్టార్‌గేజ్ అందిస్తుంది. అత్యంత ఖచ్చితత్వంతో కూడిన సమాచారం ఇవ్వడం స్టార్‌గేజ్ ప్రత్యేకత. అత్యాధుని సెన్సార్లు, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ సాయంతో పాత ఉపగ్రహాల శకలాలనూ స్టార్‌గేజ్ గుర్తించి వాటి జాడను ఆపరేటర్లకు అందజేస్తుంది. ఒకచోట పోగుబడిన శకలాల ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంచేస్తుంది. ఉపగ్రహాలు ఢీకొట్టే అవకాశాలు గణనీయంగా తగ్గించి తద్వారా అంతరిక్ష చెత్త పోగుబడకుండా, ఆ ప్రాంతంలో మరో కొత్త ఉపగ్రహం వచ్చి చేరేందుకు మార్గం సుగమం చేస్తుంది. పౌర, సైనిక, నిఘా, వాతావరణ ఉపగ్రహాల ప్రయోగాలతో దిగువ భూకక్ష్యల్లో కొత్త ఉపగ్రహాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీనికితోడు వేలాది ఉపగ్రహాల కూటమి స్టార్‌లింక్‌తో ఉపగ్రహాల సంఖ్య వేలాదిగా ఎక్కువైంది. ఈ తరుణంలో అంతరిక్షం సైతం ఒక రద్దీ అయిన రహదారిలో మారింది. రోడ్డుపై వాహనాలను క్రమబద్ధీకరించే ట్రాఫిక్ కానిస్టేబుల్ తరహా వ్యవస్థ తక్షణావసరమైంది. ఈ అవసరాన్ని స్టార్‌గేజ్ తీర్చనుంది.

### అదనంగా కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్..

ఇప్పుడున్న ఉపగ్రహాలు కొన్ని గంటల తర్వాత ఏ దిశగా ఎంత దూరం కదులుతాయి అనే వివరాలను స్టార్‌గేజ్ ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఉపగ్రహాల ఆపరేటర్లకు ఉచితంగా అందివ్వనుంది. దీంతో తోటి ఉపగ్రహాలతోపాటు ఖగోళ వస్తువులు, స్పేస్ చెత్త ఎక్కడున్నాయో ఇట్టే తెల్సిపోతుంది. వీటికి అనుగు ణంగా ఆపరేటర్లు తమ భవిష్యత్ ఉ పగ్రహాల ప్రయోగాల తేదీలను సవరించుకోవ చ్చు. దీని వల్ల అత్యంత విలువైన సమయం, ప్రయోగాల ఖర్చు కలిసివస్తాయి. స్టార్‌గేజ్ అందించనున్న అత్యంత విలువైన డేటా షేరింగ్ సమాచారాన్ని నాసా, ఇతర అంతర్జాతీయ ఉపగ్రహ ఆపరేటర్లు ఎప్పట్నుంచో కోరుతుండగా ఇన్నేళ్లకు ఇది సాకారమైంది. గత ఏడాది డిసెంబర్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ కూటమికి అత్యంత సమీపంగా చైనా ఉపగ్రహం దూసుకొచ్చింది. అవి ఢీకొట్టే పెనువినాశనం సంభవించేది. దీంతో భయపడిన స్టార్‌లింక్ ఏకంగా తమ 4,400 ఉపగ్రహాలను వెనువెంటనే 480 కిలోమీటర్ల దిగువ కక్ష్యలోకి తీసుకురావాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దనే సదుద్దేశంతో ఉచితంగా ఈ సేవలను స్టార్‌లింక్ అంతర్జాతీయంగా అన్ని దేశాలకు అందుబాటులోకి తెచ్చింది. కంజంక్షన్ డేటా మెసేజెస్(సీడీఎం)లను ఎప్పటికప్పుడు స్టార్‌గేజ్ పంపనుంది. కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్ ద్వారా గంటల తర్వాత రావాల్సిన డేటాను కేవలం నిమిషాల్లోనే సీడీఎంల రూపంలో ఆపరేటర్లు పొందొచ్చు.

# ఇండియా టీచింగ్..వరల్డ్ లెర్నింగ్

**దేశీ ఎడ్‌టెక్ ఎక్స్‌పోర్ట్ స్టోరీ స్టార్ట్**
**థాయ్, వియత్నాం టార్గెట్**
**బెంగళూరు నుంచి బ్యాంకాక్ వరకు ఎడ్‌టెక్ దూకుడు**
**యూఏఈ నుంచి ఇండోనేసియా వరకు మన కంపెనీల హవా**
**క్యూలో అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్**
**అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 25 శాతం వరకు ఆదాయం**



దేశీ ఎడ్‌టెక్ కంపెనీలు అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో విదేశాల బాట పడుతున్నాయి. పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలకు విద్యా వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తున్నాయి. అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. మన ఎడ్‌టెక్ కంపెనీలు ప్రధానంగా ఆగ్నేయాసియా, దక్షిణాసియాపై దృష్టి పెడుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వియత్నాం, థాయ్‌ల్యాండ్, ఇండొనేసియా, ఫిలిప్పీన్స్‌లాంటి మార్కెట్లలో విస్తరిస్తున్నాయి. ఆయా మార్కెట్లలో వినియోగదారుల ప్రొఫైల్ దాదాపు మన దేశం తరహాలోనే ఉండటం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

థాయ్, వియత్నాంలో అప్‌గ్రాడ్: టీమ్‌లీజ్ గణాంకాల ప్రకారం ఆగ్నేయాసియా, ఆఫ్రికా తదితర మార్కెట్లలో 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు 2 కోట్ల మంది పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాలపై మన సంస్థలు దృష్టి పెడుతున్నాయి. బెంగళూరుకు చెందిన అప్‌గ్రాడ్ సంస్థ థాయ్‌ల్యాండ్, వియత్నాంలో కార్యకలాపాలు విస్తరించింది. అలాగే యూఏఈ, మేనా ప్రాంతంలో (మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) వర్క్‌ఫోర్స్ శిక్షణకు సంబంధించి వివిధ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే సింప్లీలెర్న్ కంపెనీ వివిధ సంస్థలు, ప్రభుత్వాల భాగస్వామ్యాలతో అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియావ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక కిడ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం అయిన బ్రైట్‌ఛాంప్స్ సంస్థ ఏకంగా 30 పైగా దేశాల్లో విస్తరించింది. యూఏఈ, సౌదీ అరేబియా, వియత్నాం మొదలైనవి వీటిలో ఉన్నాయి.

ఆకర్షణీయంగా ఆగ్నేయాసియా: వియత్నాం, థాయ్‌ల్యాండ్ లాంటి ఆగ్నేయాసియా దేశాలు వేగంగా డిజిటల్ ఎకానమీలుగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో కెరియర్ పురోగతికి సంబంధించిన కోర్సులను నేర్చుకోవడంపై పెరుగుతున్న ఆసక్తిని అవకాశంగా మల్చుకోవడంపై ఎడ్‌టెక్ కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. 2024--25లో అప్‌గ్రాడ్ ఆదాయంలో అంతర్జాతీయ మార్కెట్ల వాటా 20--25 శాతంగా నమోదైంది. అటు సింప్లీలెర్న్ అంతర్జాతీయ యూజర్లలో 11 శాతం మంది బ్రిటన్, పశ్చిమాసియాలో ఉన్నారు. ఇక తమ గ్లోబల్ యూజర్లలో 30 శాతం మంది ఆగ్నేయాసియా, దక్షిణాసియా వారు ఉన్నారని బ్రైట్‌ఛాంప్స్ పేర్కొంది.

అంతర్జాతీయంగా పోటీ: మన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్నప్పటికీ అంతర్జాతీయ దిగ్గజాల నుంచి పోటీ ఎదుర్కోనాల్సి వస్తోంది. యుడెమి, ఎరుడైటస్, యుడాసిటీ, కోర్సెరాలాంటి గ్లోబల్ సంస్థలు కూడా ఈ ప్రాంతాల్లో దూకుడుగా విస్తరిస్తున్నాయి. తమకు విదేశీ మార్కెట్లలో కోర్సెరా, ఎరుడైటస్ నుంచి పోటీ ఉంటోందని అప్‌గ్రేడ్ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఎమెరిటస్, కోర్సెరా, యుడాసిటీలను సింప్లీలెర్న్ ఢీకొంటోంది. మిగతా సంస్థలతో పోలిస్తే తక్కువ వ్యయాలతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా, నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా దేశీ కంపెనీలు.. ఆయా మార్కెట్లలో పటిష్టపడేందుకు ప్రయతి?నస్తున్నాయి. లీడ్ గ్రూప్ ఈ ఏడాది 1,200 పాఠశాలలతో భాగస్వామ్యాలను లక్ష్యంగా పెట్టుకుంది.

# 'సేవా' కుటుంబం

**పిల్లలతో కలిసి సేవా కార్యక్రమాలు**
**కుటుంబ బంధాలకు సూపర్ పవర్**
**పేరెంటింగ్‌తో పాటు వాలంటీరింగ్**
**బాలల వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది**
**సామాజిక సేవకూ ఇదే ఆరంభం**
**వెల్లడిస్తున్న తాజా అధ్యయనాలు**



కుటుంబం అంతా కలిసి పాల్గొనే సేవా కార్యక్రమాలు పిల్లల వ్యక్తిత్వాన్ని చక్కగా రూపుదిద్దటమే కాకుండా, వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చి దిద్దుతాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, ఒక మంచి పని కోసం కుటుంబం అంతా కలిసికట్టుగా శ్రమించటం వల్ల, పిల్లలు పెరిగి పెద్దయ్యాక అవి తీపి జ్ఞాపకాలుగామిగిలిపోతాయని మనోవికాస నిపుణలు చెబుతున్నారు. ఇతరులకు సహాయం చేయడంలోని గొప్పతనం, ఔన్నత్యం 'వాలంటీరింగ్' ద్వారా పిల్లలకు అర్థం అవుతుంది. దీనివల్ల వారిలో జాలి, దయ, కరుణ, ఓర్పు, కృతజ్ఞతా భావం వంటి మంచి గుణాలు ఏర్పడతాయి. మనం చేసే చిన్న సాయమైనా ఒకరి జీవితంలో ఎంత పెద్ద మార్పును తీసుకురాగలదో పిల్లలు స్వయంగా తెలుసుకుంటారు.

### ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

తల్లిదండ్రులు పిల్లల్ని తరచూ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవటానికి తీసుకెళ్లటం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇతరుల పట్ల ప్రేమతో మెలుగుతారు. నలుగురితో కలిసి పని చేయటం నేర్చుకుంటారు. సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యాలను అలవరచుకుంటారు.

### కుటుంబ బంధం బలపడుతుంది

ఇంట్లో అందరూ కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల, రోజూవారీ పనుల ఒత్తిడి లేకుండా కుటుంబ సభ్యులందరూ ఆహ్లాదకరమైన సమయాన్ని గడపవచ్చు. ఫోన్లకు, టీవీలకు లేదా ఇంటి పనులకే పరిమితం అయిపోకుండా.. ఒక మంచి లక్ష్యం కోసం అందరూ కలిసి పనిచేసినట్లవుతుంది. ఇది కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలపరుస్తుంది.

### ఎలాంటి సేవల్ని ఎంచుకోవాలి?

పిల్లల వయసును బట్టి, వారికి ఆసక్తి ఉన్న పనులు ఎంచుకోవడం ముఖ్యం. చిన్న పిల్లలైతే చేతులతో చేసే చిన్న చిన్న పనులను ఇష్టపడతారు, అదే కొంచెం పెద్ద పిల్లలైతే బాధ్యత తీసుకునే పనులను లేదా నాయకత్వం వహించే పనులకు చొరవ చూపుతారు. ఏమైనా, అది వారికి సరదాగా అనిపించాలి. ఆ పని తప్పక చేయాలనే ఉత్సాహం వారిలో కలగాలి. పనుల ఎంపికకు ఇవే గీటురాళ్లు. నెలకు ఒక్కసారి.. కుదరకపోతే రెండునెలలకు ఒక్కసారైనా వాలంటీరింగ్ చేసినా చాలు, అది పిల్లల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది.

### నివేదికలు..అధ్యయనాలు

'పాయింట్స్ ఆఫ్ లైట్' అనే స్వచ్ఛంద సంస్థ ఏటా 'ఫ్యామిలీ వాలంటీర్ డే' ని నిర్వహిస్తుంది. కుటుంబంతో కలిసి సేవ చేయడం వల్ల పిల్లల్లో సహానుభూతి పెరుగుతుందని, సామాజిక బాధ్యత అలవడుతుందని వారి అధ్యయనాలు చెబుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సర్వే ప్రకారం, స్వచ్ఛంద సేవల్లో పాల్గొనే పిల్లల్లో ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు 18 నుంచి 35 శాతం వరకు తక్కువగా ఉంటున్నాయి. ఇండియానా యూనివర్సిటీ జరిపిన సర్వేలో టీనేజర్లు, బాలలు సేవా కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా సమాజం తీరును గ్రహిస్తున్నారు. సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటున్నారు. చిన్నప్పటి నుండి సేవ చేసే అలవాటు ఉన్న పిల్లలు, పెద్దయ్యాక కూడా సమాజానికి సేవ చేసే అవకాశం 50 శాతం ఎక్కువగా ఉంటుందని 'కార్పొరేషన్ ఫర్ నేషనల్ అండ్ కమ్యూనిటీ సర్వీస్' గణాంకాలు చెబుతున్నాయి.

# సండే స్టాక్ మార్కెట్ -- భారీ పతనం




న్యూఢిల్లీ : కేంద్ర వార్షిక బడ్జెట్ వేళ .... దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. నిఫ్టీ 300 పాయింట్లకు పైగా, సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా పడింది. సాధారణంగా ఆదివారం రోజు స్టాక్ మార్కెట్లకు సెలవు. అయితే యూనియన్ బడ్జెట్ 2026 కారణంగా.. కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు యధావిధిగా కొనసాగుతున్నాయి. నేడు దేశీయ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:25 గంటలకు 290.58 పాయింట్ల నష్టంతో 82,275.79 వద్ద, నిఫ్టీ 117.45 పాయింట్ల నష్టంతో 25,301.45 వద్ద కొనసాగుతున్నాయి. యునైటెడ్ ఫుడ్‌బ్రాండ్స్ లిమిటెడ్, సర్వోటెక్ రెన్యూవబుల్ పవర్ సిస్టమ్ లిమిటెడ్, రాజ్‌దర్శన్ ఇండిస్టీస్ లిమిటెడ్, ఐకెఐఒ టెక్నాలజీస్ లిమిటెడ్, ఫుజియామా పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. హిందూస్తాన్ కాపర్ లిమిటెడ్, ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ గోల్డ్ ఈటీఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఈటీఎఫ్, ఇంటెలెక్ట్ డిజైన్ అరీనా లిమిటెడ్ కంపెనీలు నష్టాల జాబితాలోకి చేరాయి.

# చంద్రబాబు లక్షణం హింసను క్రియేట్ చేయడమే: సజ్జల



గుంటూరు: ప్రజలు మీకు అధికారం కట్టబెట్టింది దేనికి?.. ప్రశ్నించే గొంతులను వేధించడానికా? అంటూ చంద్రబాబు సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసలేం జరుగుతోందంటూ ప్రశ్నించారు. "లడ్డూలో కొవ్వు కలిసిందని సీఎం హోదాలో బాబు చెప్పారు. బాధ్యతారాహిత్యంగా ఎలా మాట్లాడతారు?" అంటూ సజ్జల మండిపడ్డారు. "కల్తీ నిజమంటూ ఫ్లెక్సీలు వేసి దుష్ప్రచారానికి దిగారు. తప్పుడు ఫ్లెక్సీలను మా పార్టీ నేతలను ప్రశ్నించారు. టీడీపీ నేతలను పోలీసులు ఎందుకు అడ్డుకోలేదు. చట్టం.. గూండాలను, అరాచకశక్తులను రక్షించింది. మా పార్టీ నేతలకు ప్రాణాపాయం జరిగితే ఎవరిది బాధ్యత?. పోలీస్ ఉన్నతాధికారులకు బొత్స ఫోన్ చేసినా స్పందన లేదు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు పెట్టాలి. మా పోరాటం అహింసాయుతంగా ఉంటుంది. కోర్టులను ఆశ్రయిస్తాం, గవర్నర్‌ను కూడా కలుస్తాం" అని సజ్జల పేర్కొన్నారు. ఊరుపేరులేని ఫ్లెక్సీలను పోలీసులే తొలగించాలి. డీజీపీ, హోంమంత్రి సమాధానం చెప్పాలి. విడుదల రజిని, భూమన, బ్రహ్మనాయుడిపైనా దాడికి యత్నించారు. గతంలో టీడీపీ నేత పట్టాభి ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారు. చంద్రబాబు లక్షణం హింసను క్రియేట్ చేయడమే. ఎమ్మెల్యే గల్లా మాధవి దగ్గరుండి దాడులు చేయించారు. టీడీపీ అరాచకాలను చట్టబద్ధంగా ఎదుర్కొంటాం. డిజిటల్ బుక్‌లో అరాచకవాదుల పేర్లు ఎక్కిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చాక అరాచక వాదులకు శిక్ష తప్పదు. మాజీ హోంమంత్రిని ఎస్పీ ఆఫీస్ గేట్ ఎదుట వెయిట్ చేయించారు. లోకేష్ నోటి వెంట వచ్చే ప్రతి మాట బూతే" అని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దిశా నిర్దేశంలేని కేంద్ర బడ్జెట్ : ధ్వజమెత్తిన మమతా బెనర్జీ



కోల్‌కతా: 2026-27 కేంద్ర బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం తర్వాత, ఢిల్లీకి బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. పెద్ద పెద్ద మాటలు చెప్పడమే తప్ప, సామాన్య ప్రజలకు ఈ బడ్జెట్‌లో ఒరిగిందేమీలేదని, ఇది ప్రజా వ్యతిరేకమైందనీ పేర్కొన్నారు. ప్రధానంగా బెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆమె ధ్వజమెత్తారు. లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఆమె విమర్శలు గుప్పించారు. "ఇది యాంటీ యూత్, యాంటీ పూర్, యాంటీ బీసీ ఎస్టీ, మైనార్టీ, మహిళా వ్యతిరేక, రైతు వ్యతిరేక, విద్యా వ్యతిరేక" అని బడ్జెట్ అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మండి పడ్డారు. ఈ బడ్జెట్‌ను అలాగే ఎలాంటి దూరదృష్టిలేని దిశానిర్దేశం లేనిదని, వ్యాఖ్యానించారు. ఇది మొత్తంగా అబద్దాల పుట్ట అన్నారు. పన్నులను రాష్ట్రాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న కేంద్రం, తామేదో ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటోందని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను, రాజ్యాంగ నిర్మాణాన్ని, స్వతంత్ర సంస్థలను కేంద్రం నాశనం చేస్తున్న కేంద్రానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదంటూ ఘాటుగా విమర్శించారు. అలాగే బడ్జెట్‌లో ప్రతిపాదించిన మూడు కారిడార్ల అంశంపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తాము ఆ ప్రాజెక్టులపై పని చేస్తున్నామన్నారు. పురులియాలోని 'జంగల్ సుందరి' ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వమే రూ. 72వేల కోట్లు పెట్టుబడి పెడుతోందని గుర్తు చేశారు. హిమాలయాలను దాటిపోయేంత అసత్యాల పుట్ట అని అభివర్ణించారు. అర్థిక వ్యవస్థ గాడి తప్పిందనీ, సెన్సెక్స్, నిఫ్టీ కుప్పకూలిందన్నారు. మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బడ్జెట్‌పై వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. తాను రేపు పార్లమెంట్ కల్పించిన వేదికద్వారా మాట్లాడతానని రాహుల్ లేకరులతో అన్నారు.

# సౌదీ, ఇజ్రాయెల్‌లకు అమెరికా ఆయుధాలు



వాషింగ్టన్: ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలకు భారీగా ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధమైంది. ఇజ్రాయెల్‌కు 667 కోట్ల డాలర్లు, సౌదీకి 900 కోట్ల డాలర్ల విలువైన అత్యాధునిక ఆయుధాలను పెద్ద మొత్తంలో విక్రయించేందుకు ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులు చేసే అవకాశం ఉందన్న వార్తలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు తెలిపిన విదేశాంగ శాఖ, ఆ వెంటనే ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. విదేశాంగ విధానానికి అనుగుణంగా, అమెరికా ప్రయోజనాలరీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో తెలిపింది. సౌదీకి విక్రయించే వాటిలో 730 పేట్రియాట్ క్షిపణులు, సంబంధిత పరికరాలున్నాయి. వీటితో సౌదీ అరేబియా క్షిపణి రక్షణ వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపింది. అదేవిధంగా, 30 అపాచీ అటాక్ హెలికాప్టర్లు, సంబంధిత సామగ్రి, 3,250 లైట్ టాక్టికల్ వాహనాలను ఇజ్రాయెల్‌కు విక్రయించనున్నామని వివరించింది.

# మరాఠా గడ్డపై 'సునేత్ర' చరిత్ర..

# వీళ్ల గురించి తెలుసా?




మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉపముఖ్యమంత్రి కానున్నారు. ఆమె శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఇప్పటి వరకు మన దేశంలో ఐదుగురు మహిళలు.. ఉప ముఖ్యమంత్రి బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వారిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యలక్ష్మి.. కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పనిచేశారు.

కమలమ్మ.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1952లో కమలమ్మ తాత్కాలికంగా డిప్యూటీ సీఎంగా పనిచేశారు. దీంతో, ఆమె దేశ చరిత్రలోనే మొదటి ఉప ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారు.

పాముల పుష్ప శ్రీవాణి.. ఏపీలో వైఎస్సార్‌సీపీ ?ప్రభుత్వ హయాంలో పుష్ప శ్రీవాణి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో దాదాపు మూడేళ్ల పాటు డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగారు.

తారాసింగ్.. పంజాబ్‌కు చెందిన తారా సింగ్ 1960లో తాత్కాలికంగా ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆమె విధుల్లో కొనసాగారు.

రాజేంద్ర కౌర్ భట్టాల్.. పంజాబ్‌కు చెందిన రాజేంద్ర కౌర్ భట్టాల్ 1996లో ఉప ముఖ్యమంత్రిగా విధుల్లో కొనసాగారు. ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ప్రభుత్వంలో దాదాపు మూడేళ్లకు పైగా ఆమె డిప్యూటీ సీఎంగా ఉన్నారు.

నిత్యానందా దేవి.. బీహార్‌కు చెందిన నిత్యానందా దేవి 1990ల్లో తాత్కాలికంగా డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఆర్జేడీ ప్రభుత్వ హయాంలో ఆమె విధులు నిర్వహించారు.

జమునా దేవి.. మధ్యప్రదేశ్‌కు చెందిన జమునా దేవి 1998లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎంగా ఐదేళ్ల పాటు కొనసాగారు. దిగ్విజయ్ సింగ్ ప్రభుత్వం ఐదేళ్ల పీరియడ్ మొత్తం ఆమె ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. దీంతో, ఎక్కువ కాలం డిప్యూటీ సీఎంగా ఉన్న మహిళగా ఆమె రికార్డుల్లోకి ఎక్కారు.

కమలా బెనీవల్.. రాజస్థాన్‌కు చెందిన కమలా బెనీవల్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే డిప్యూటీ సీఎంగా కొనసాగారు. 2003లో అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆమె ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు.

దియా కుమారి.. రాజస్థాన్‌కు చెందిన దియా కుమారి బీజేపీ ?ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా దాదాపు రెండేళ్ల పాటు ఉన్నారు. ప్రస్తుత భజన్ లాల్ శర్మ ప్రభుత్వంలో 2023 నుంచి బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

పార్వతీ పరిడా.. ఒడిశాకు చెందిన పార్వతి ప్రస్తుత సీఎం మోహన్ చరణ్ మాంఝీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు. 2024 జూన్ నుంచి బాధ్యతల్లో ఉన్నారు. అయితే, దేశంలో ముఖ్యమంత్రి స్థానాల్లో మహిళలు ఎక్కువ కాలం సేవలు చేసినప్పటికీ.. ఉప ముఖ్యమంత్రులుగా మాత్రం చాలా తక్కువ మంది, తక్కువ కాలం మాత్రమే విధుల్లో ఉన్నారు. పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మాత్రమే మహిళలు ఈ పదవిని చేపట్టారు. ప్రస్తుతం (2026 జనవరి నాటికి) రెండు రాష్ట్రాల్లో (రాజస్థాన్, ఒడిశా) మాత్రమే మహిళలు డిప్యూటీ ముఖ్యమంత్రి హోదాలో కొనసాగుతున్నారు. భవిష్యత్తులో మహిళల రాజకీయ ప్రాధాన్యం పెరుగుతున్నందున మరిన్ని రాష్ట్రాల్లో మహిళలు డిప్యూటీ సీఎంలుగా ఉండే అవకాశం ఉంది.

# అంతరిక్షంలోకి 10 లక్షల ఏఐ శాటిలైట్లు!

## సూపర్ కంప్యూటర్ల వలయాన్ని సృష్టించనున్న ఎలాన్‌మస్క్

## అంతరిక్షం నుంచే నేరుగా ఏఐ సేవలు

## అనుమతి కోసం అమెరికా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్‌కు దరఖాస్తు చేసిన స్పేస్‌ఎక్స్



ప్రైవేట్ అంతరిక్ష రంగం, కృత్రిమ మేధ రంగాలను అత్యంత వేగంగా విస్తరించే బృహత్తర ప్రాజెక్టుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ రంగం సిద్ధంచేస్తున్నారు. మానవాళి కృత్రిమ మేధ అవసరాలను వందల కిలోమీటర్ల ఎత్తులో అంతరిక్షం నుంచే నేరుగా తీర్చేందుకు ఏకంగా 10,00,000 ఏఐ సూపర్‌కంప్యూటర్లను నింగిలోకి పంపనున్నారు. ఒక్కో కృత్రిమమేధ సూపర్‌కంప్యూటర్‌ను ఒక్కో ఉపగ్రహంతో అనుసంధానించి సేవలు అందించాలని మస్క్ కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ 'స్పేస్‌ఎక్స్'లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం మొత్తంగా 10 లక్షల ఏఐ సూపర్‌కంప్యూటర్ ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లాలని స్పేస్‌ఎక్స్ నిర్ణయించింది. ప్రయోగాల కోసం అమెరికా ప్రభుత్వ అనుమతి కోరారు. అతిపెద్ద జల్లెడ మాదిరిగా శాటిలైట్లన్నీ ఒకదానితో మరోటి లేజర్ కాంతిపుంజంతో అనుసంధానమై ఉంటాయి. తద్వారా ఉమ్మడిగా ఊహించనంత వేగంగా కృత్రిమ మేధ సేవలను అందించనున్నాయి. ఇన్నేసి సూపర్‌కంప్యూటర్లను భూమిపై సర్వర్‌ఫామ్‌లో ఏర్పాటుచేసి నిర్వహించాలంటే అత్యధిక స్థాయిలో విద్యుత్‌ను నిరంతరంగా సరఫరాచేయాల్సి ఉంటుంది. ఇది ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాకపోవడంతో సౌరశక్తిని ఉపయోగించుకుని ఆకాశంలోనే అతిపెద్ద సోలార్‌ప్యానెల్ వ్యవస్థను ఏర్పాటుచేసి తద్వారా 10 లక్షల ఏఐ కంప్యూటర్ల శక్తి అవసరాలు తీర్చనున్నారు. 1968లో వచ్చిన '2001: స్పేస్ ఒడిస్సీ'హాలీవుడ్ చిత్రంలో 'హాల్ 9000'కృత్రిమమేధావి చేసే ప్రయోగాలు ఇన్నాళ్లూ సినిమాలకే పరిమితంకాగా ఇకపై వాటిని నిజజీవితంలోకి తీసుకొస్తామని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఏఐ కంప్యూటర్ల దండును నింగిలో మోహరింపజేసి ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది వినియోగదారుల కృత్రిమమేధ అవసరాలు తీర్చబోతున్నామని మస్క్ వివరించారు. ఈ వ్యవస్థకు 'ఆర్బిటల్ డేటా సెంటర్ సిస్టమ్'అని పేరు పెట్టారు. ఇది అందుబాటులోకి వస్తే భూమిపై వినియోగదారులకు సంబంధించిన విపరీతమైన సమాచారం, సంక్లిష్టమైన డేటాను అత్యధిక వేగంతో ప్రాసెస్ చేయడమూ సాధ్యమవుతుంది. ఎప్పటికప్పుడు కొత్త తరహా ఏఐ మోడళ్లను పరీక్షించి అందుబాటులోకి తేవచ్చు. భూమి నుంచి 500 నుంచి 2,000 కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహాలను ప్రవేశపెట్టనున్నారు. వీటిని ఒకదానితో మరోటి ఢీకొట్టకుండా వీలైనంత దూరంలో కక్ష్యలో స్థిరపరచనున్నారు. "ఊహించనంతగా వచ్చి పడుతున్న ఏఐ డిమాండ్‌ను అందుకోవాలంటే భూమి మీద సౌకర్యాల విస్తరణతో సాధ్యంకాదు. అంతరిక్షంలో కక్ష్యల్లో కొలువుతీరిన లక్షలాది ఉపగ్రహాలతోనే ఇది సాధ్యం. పుష్కలంగా లభించే సౌరశక్తిని ఒడిసిపట్టి ఈ సూపర్‌కంప్యూటర్ల విద్యుత్‌శక్తి అవసరాలు తీర్చుతాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా కేంద్రంగా అంతరిక్షాన్ని సిద్ధంచేయబోతున్నాం"అని మస్క్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు.

### స్టార్‌లింక్ స్ఫూర్తితో..

ఇప్పటికే వేలాది కృత్రిమ ఉపగ్రహాలతో మస్క్ కు చెందిన స్టార్‌లింక్ సంస్థ విశ్వవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. దీని స్ఫూర్తితోనే ఏఐ సేవలు అందించేందుకు ఆర్బిటల్ డేటా సెంటర్ సిస్టమ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ నెలలోనే ఇందుకు సంబంధించిన పనులు మొదలెట్టారు. ఇందుకోసం అమెరికా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్(యూఎస్ఎఫ్‌సీసీ) వద్ద స్పేస్‌ఎక్స్ దరఖాస్తు చేసుకుంది. భూమిపై ఏర్పాటుచేసిన డేటా సెంటర్లు పవర్ గ్రిడ్‌లతో అనుసంధానమై ఉన్నాయి. విద్యుత్ అంతరాయం పెద్ద అవరోధంగా తయారైంది. అతిపెద్ద సర్వర్‌ఫామ్‌ల ఏర్పాటుకు భూమి సేకరణ ఇబ్బందిగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో భూమి సేకరణ అనేది ఖరీదైన వ్యవహారంగా తయారైంది. విద్యుత్ తయారీకి బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను వినియోగిస్తారు. దీంతో ఇంతపెద్ద ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడమూ కష్టమే. ఈ సమస్యలేవీ అంతరిక్షంలో ఉండవు. ఆ కారణంతోనూ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు నింగిని వేదికగా ఎంపికచేశారు. భూమి మీద ఏఐ సూపర్‌కంప్యూటర్లను చల్లబరిచేందుకు కూలింగ్ వ్యవస్థలు అవసరం. అదే అంతరిక్షంలో శూన్యం ఉంటుందికాబట్టి ఇది సహజ రిఫ్రిజిరేటర్‌గా పనిచేస్తుంది. రాత్రిళ్లు అత్యల్ప ఉష్ణోగ్రతలకు ఏఐ వ్యవస్థ ఆటోమేటిక్‌గా చల్లబడుతుంది. విద్యుత్ అవసరం కూడా ఉండదు. 10 లక్షల ఉపగ్రహాల మధ్య సమాచారాన్ని హైస్పీడ్ లేజర్ కాంతిపుంజం రూపంలో బదిలీచేస్తారు. దీంతో ట్రిలియన్ల బైట్ల డేటా వేగంగా సరఫరా అవుతుంది. ఈ వ్యవస్థ మొత్తం ఆకాశంలో ఏర్పాటయ్యాక ప్రతి టన్ను సౌరఫలకాల వ్యవస్థ నుంచి ఏకంగా 100 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుంది. దీంతో అక్కడి డేటా సెంటర్ల శక్తి అవసరాలు సైతం తీరనున్నాయి.

# భారత్‌పై మొబైల్ మాల్‌వేర్ దాడులు

## బాధిత దేశాల్లో ముందంజలో మనదేశం

## యాప్ స్టోర్లలో హానికరమైన సాఫ్ట్‌వేర్

## ఐటీ సెక్యూరిటీ సంస్థ జీస్కేలర్ వెల్లడి




ఇంటర్నెట్ వాడకం పెరిగే కొద్దీ మొబైల్ మాల్‌వేర్ దాడులు ప్రపంచవ్యాప్తంగా అధికం అవుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కస్టమర్ల మొబైల్స్‌లోకి హానికరమైన సాఫ్ట్‌వేర్ (మాల్‌వేర్) ద్వారా చొరబడేందుకు కొత్త పంథాను అందిపుచ్చుకుంటున్నారు. మొబైల్ మాల్‌వేర్ దాడులకు గురైన దేశాల్లో మరోసారి భారత్ అగ్రశ్రేణి కేంద్రంగా అవతరించింది. డిజిటలైజేషన్ దిశగా దూసుకెళ్తున్న భారత మార్కెట్లో స్మార్ట్‌ఫోన్స్, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలు, కీలకమైన మౌలిక సదుపాయాలను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారని అమెరికాకు చెందిన ఐటీ సెక్యూరిటీ సంస్థ జీస్కేలర్ చెబుతోంది. మొబైల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆపరేషనల్ టెక్నాలజీ విభాగాల్లో మాల్‌వేర్ దాడులపై కంపెనీ రూపొందించిన థ్రెట్‌ల్యాబ్జ్--2025 థ్రెట్ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన మొబైల్ మాల్‌వేర్ దాడుల్లో 26 శాతం వాటాతో భారత్ మొదటిస్థానంలో ఉంది.

### లక్ష్యం ఆర్థిక లాభం..

అంతర్జాతీయంగా సైబర్ నేరగాళ్లకు మన దేశం అతిపెద్ద లక్ష్యంగా మారింది. మొబైల్ యాప్స్, డిజిటల్ చెల్లింపులు, రోజువారీ జీవితంలో ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయిన పరికరాల వినియోగం పెరగడం వల్ల భారత్‌లో మొబైల్ మాల్‌వేర్ అటాక్స్ ఏడాదిలో 38 శాతం అధికమయ్యాయి. మొబైల్ మాల్‌వేర్ దాడుల ప్రధాన లక్ష్యం పాస్‌వర్డ్స్, బ్యాంకింగ్ సమాచారాన్ని దొంగిలించడం. తద్వారా ఆర్థిక లాభం పొందడం. అలాగే కంపెనీల సేవలకు అంతరాయం కలిగించి డబ్బు డిమాండ్ చేయడం. బ్యాంక్ ఖాతా నిలిచిపోతుందనో, పాయింట్స్ రిడీమ్, ఆధార్ అప్‌డేట్, తరచూ వాడుతున్న యాప్ అప్‌డేట్ పేరుతో మొబైల్ యూజర్లను సైబర్ నేరస్తులు వలలో వేసుకుంటున్నారు.

### యాప్ స్టోర్లలోకి మాల్‌వేర్..


యాప్ స్టోర్లలోకి హానికరమైన యాప్స్ చొరబడుతుండటం ఆందోళన కలిగించే అంశం. గూగుల్ ప్లే స్టోర్‌లో 239 హానికర ఆండ్రాయిడ్ యాప్స్‌ను జీస్కేలర్ పరిశోధకులు గుర్తించారు. ఈ యాప్స్ ఇప్పటికే 4.2 కోట్లకుపైగా డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి. ఈ యాప్స్‌లో చాలా వరకు ఉత్పాదకత మెరుగుపరిచే సాధనాలుగా తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఆండ్రాయిడ్ మాల్‌వేర్ కార్యకలాపాలు 2024తో పోలిస్తే గత సంవత్సరంలో 67 శాతం పెరిగాయి. స్పైవేర్, బ్యాంకింగ్ మాల్‌వేర్ కీలక ముప్పుగా పరిణమించాయి. ఐఓటీ డివైస్‌ల విషయానికివస్తే రూటర్స్ 75% దాడులకు గురయ్యాయి. మొబైల్ మాల్‌వేర్ బాధిత టాప్--10 దేశాల్లో భారత్, యూఎస్, కెనడా, మెక్సికో, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఇజ్రాయిల్, యూకే, యూఏఈ, ఇటలీ ఉన్నాయి.


### టాప్--4లో భారత్..

భారత్‌లో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులు, సంస్థలను సైబర్ నేరగాళ్లు ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొత్తం మాల్‌వేర్ దాడుల్లో వీటి వాటా 38% ఉంది. హాస్పిటాలిటీ, రెస్టారెంట్స్ వాటా 31% ఉంది. తయారీ, ఇంధన సంబంధిత రంగాలను కూడా సైబర్ నేరగాళ్లు వదలడం లేదు. ఈ పరిశ్రమలు కనెక్టెడ్ వ్యవస్థలు, ఐఓటీ పరికరాలపై ఎక్కువగా ఆధారపడతాయి. అధిక నష్టాన్ని కలిగించాలని చూస్తున్న సైబర్ నేరగాళ్లకు ఇవి ఆకర్షణీయమైన లక్ష్యాలుగా మారాయి. మొత్తం ఐఓటీ మాల్‌వేర్ కార్యకలాపాల్లో 54% వాటాతో గ్లోబల్ హాట్‌స్పాట్‌గా అమెరికా నిలిచింది. 5 శాతం వాటాతో భారత్ నాల్గో స్థానంలో ఉంది.

### మొబైల్ చెల్లింపులపై..

మన దేశంలో బ్యాక్‌డోర్, బోట్‌నెట్--స్టైల్ మాల్‌వేర్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 16 లక్షలపైచిలుకు ఆండ్రాయిడ్ టీవీ బాక్సుల్లోకి మాల్‌వేర్ చొచ్చుకుపోయిందని ఒకనివేదిక వెల్లడించింది. ఇందులో ప్రధాన బాధిత దేశంగా భారత్ ఉంది. చమురు, సహజవాయువు రంగంలో ఉద్యోగార్థులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్ దాడులు చేస్తున్నారని వివరించింది. అంతేగాక మొబైల్ చెల్లింపులపై ఎక్కువ దృష్టి పెడుతున్నారని తెలిపింది.



# ఏఐ సంక్షోభం.. ఏం చేయాలో ఆలోచించాలి!




ప్రపంచంలోని టాప్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీల్లో ఒకటిగా ఉన్న జేపీ మోర్గాన్ చేజ్ సీఈఓ జామీ డిమోన్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. మొన్నటి వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతిని తీవ్రంగా వ్యతిరేకించిన డిమోన్.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వల్ల పని దినాలు తగ్గుతాయని అంచనా వేయడం గమనార్హం.

### వారానికి 3.5 రోజుల పనే!

బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిమోన్ మాట్లాడుతూ.. ఏఐ ప్రభావంతో భవిష్యత్ తరాల జీవనశైలి పూర్తిగా మారిపోతుందని పేర్కొన్నారు. 'వచ్చే మూడు నాలుగు దశాబ్దాల్లో మన పిల్లలు వారానికి కేవలం నాలుగు లేదా మూడున్నర రోజులు మాత్రమే పని చేసే స్థాయికి ఏఐ ఉత్పాదకతను పెంచుతుంది' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత వల్ల పని గంటలు తగ్గి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మెరుగుపడటం అనేది ఒక అద్భుతమైన విషయం అన్నారు.

### జేపీ మోర్గాన్‌లో ఇప్పటికే ఏఐ జోరు

కేవలం అంచనాలు వేయడమే కాకుండా, తన బ్యాంకులో ఇప్పటికే ఏఐని భారీగా వినియోగిస్తున్నట్లు డిమోన్ వెల్లడించారు. మోసాల గుర్తింపు, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఎర్రర్ రిడక్షన్ వంటి చాలా విభాగాల్లో ఏఐని వాడుతున్నట్లు చెప్పారు. సంస్థలోని సుమారు 1,50,000 మంది ఉద్యోగులు ఇప్పటికే లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సాంకేతికత ఎప్పుడూ ఉద్యోగాలను మారుస్తూనే ఉంటుంది. కానీ ఏఐ తెచ్చే మార్పులు వేగంగా ఉంటాయి. ప్రభుత్వం, వ్యాపార సంస్థలు ఈ మార్పునకు ఇప్పుడే సిద్ధం కావాలి' అని జామీ డిమోన్ తెలిపారు.

ఉద్యోగ ముప్పుపై హెచ్చరిక

ఒకవైపు ఆశావాదాన్ని ప్రకటిస్తూనే, మరోవైపు ఉద్యోగాల తొలగింపుపై డిమోన్ వాస్తవాలను బయటపెట్టారు. పరిశ్రమలు ఏఐని స్వీకరించే క్రమంలో ఉద్యోగాల నష్టాన్ని తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించారు. రాబోయే ఐదేళ్లలో ఏఐ వల్ల పెరిగే ఉత్పాదకత కారణంగా బ్యాంకులో తక్కువ మంది ఉద్యోగుల అవసరం ఉంటుందని అంగీకరించారు. ఉద్యోగాలు కోల్పోయే వారిని ఎలా ఆదుకోవాలనే అంశంపై ప్రభుత్వాలు, సంస్థలు ఆలోచించాలని సూచించారు.

# వర్జిన్ కోకోనట్‌తో వండర్స్..!



సాధారణ కొబ్బరి తోటను ఒక అద్భుతమైన 'సూపర్ ఫుడ్' ఉత్పత్తి కేంద్రంగా, వ్యవసాయ పర్యాటక స్థలంగా మార్చవచ్చా? నిస్సందేహంగా అంటున్నాడు గోవాకు చెందిన యువ రైతు పారిశ్రామికవేత్త రోహన్. తన తండ్రి నాటిన తోట అది. కొబ్బరి కాయలను మాత్రమే అమ్మేవారు. కరోనా తర్వాత ఈ ఫామ్‌పై దృష్టి సారించిన రోహన్ ఈ తోట రూపు రేఖలు మార్చేశారు. ఐదేళ్లలో తన కలను సాకారం చేసుకున్నారు. కొబ్బరి కాయలు, బోండాలు అమ్మే చోట.. కొబ్బరి పాల నుంచి ప్రత్యేక పద్ధతిలో 'వర్జిన్ కోకోనట్ ఆయిల్'ను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. చెట్టుకు కాసే కాయ నుంచి వర్జిన్ కొబ్బరి నూనె తయారీ వరకు చేసే పనులను స్వయంగా చూడాలనుకునే వారికి ఫామ్ విజిట్‌కు ఆహ్వానిస్తున్నారు. పనిలో పనిగా సంప్రదాయ గోవా గ్రామీణ వంటకాలను రుచిచూపిస్తున్నారు. ఇటు వ్యవసాయ పర్యాటకం, అటు ఆరోగ్యదాయకమైన నూనె ఉత్పత్తితో మంచి ఆదాయం గడిస్తున్న రోహన్ యువ కొబ్బరి 'రైతు పారిశ్రామిక వేత్త'గా ఆదర్శప్రాయుడయ్యారు. కొబ్బరైనా మరొకటైనా కేవలం పండించి ముడిసరుకుగా అమ్మజూపితే రైతుకు దక్కేది మార్కెట్ ధరలో కొంచమే. రూపం మార్చి, కొంచెం వ్యాపార దృష్టిని కలిపి అమ్మటం నేర్చుకుంటేనే రైతుకు ఆర్థిక భద్రత, సుస్థిరత చేకూరుతుంది. రైతులు ఆర్థికంగా నిలబెట్టే మెలకువలు బోధించే నిపుణులు చెబుతుండే ఈ సూత్రాన్ని తు.చ. తప్పకుండా పాటించారు రోహన్. మైక్రోబయాలజిస్ట్‌గా శిక్షణ పొందిన రోహన్ ఎంబీఏ పూర్తిచేసి 2021 వరకు బెంగళూరులో వివిధ సంస్థల్లో దశాబ్దానికి పైగా పనిచేశాడు. కరోనా తర్వాత కుటుంబానికి చెందిన సంప్రదాయ కొబ్బరి తోటపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి గుణాత్మకమైన మార్పు సాధించారు. ఉత్తర గోవాలోని ముల్గావ్ అనే గ్రామంలోని ఒక చిన్న కొబ్బరి తోట వారిది. ఆరోగ్య స్పృహతో కూడిన వర్జిన్ కొబ్బరి నూనె బ్రాండ్‌ను నిర్మించాడు. శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వర్జిన్ కొబ్బరి నూనెను ఉత్పత్తి చేస్తున్నారు. స్థానికులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. సాధారణ కొబ్బరి కాయలను ఉత్పత్తి చెయ్యటానికి బదులు సమాజానికి ఔషధగుణాలు కలిగి ఉండే వర్జిన కొబ్బరి నూనెను గౌరవప్రదంగా ఎలా ఉత్పత్తి చేసి లాభదాయకంగా ఎలా అమ్మొచ్చో తెలియజెబుతున్నారు. 'నిదానంగా తయారు చేసిన నిజమైన ఆహారం' గురించి తెలుసుకోవాలనుకునే వారికి చక్కటి వ్యవసాయాధారిత పరిశ్రమను కళ్ల ముందుంచుతున్నారు.

### నూనె ఉత్పత్తికి ఆరు గంటలు..

ఆ తోటలో రోహన్ తండ్రి చాన్నాళ్ల క్రితం నాటిన దాదాపు 200 ఎత్తుగా ఎదిగిన కొబ్బరి చెట్లు ఉన్నాయి. 150కి పైగా లేత మొక్కలున్నాయి. సాధారణ కొబ్బరి నూనె తలకు రాసుకునే నూనెగా, కొన్ని సార్లు వంట నూనెగా ఉపయోగించడానికి మించి ప్రజలకు మేలైన ఆరోగ్యాన్నందించే సూపర్‌ఫుడ్‌గా అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని అతను నమ్మాడు. కొబ్బరి పాలతో తయారు చేసే వర్జిన్ కొబ్బరి నూనె రూపంలోకి మార్చటానికి రోహన్ వ్యక్తిగత శ్రద్ధతో కృషి చేశారు. పచ్చి కొబ్బరి నుంచి పాలు తీసిన తర్వాత, ఆ పాల నుంచి ట్రేడ్‌మార్క్ చేసిన 'హాట్ ఎక్స్‌ట్రాక్షన్ యాంటీఆక్సిడెంట్ లాడెన్' పద్ధతిలో పోషకాలు పోకుండా నెమ్మదిగా నూనెను వెలికి తీస్తారు. ఈ ప్రక్రియకు 6 గంటల సమయం పడుతుంది. ఫలితంగా నూనె సహజంగా యాంటీఆక్సిడెంట్లు, లారిక్ ఆమ్లంతో సమృద్ధిగా ఉంటుంది. తల్లి పాలలో ఉండే ముఖ్యమైన కొవ్వు ఆమ్లం, దాని యాంటీమైక్రోబియల్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది.

### మోస్తరు వేడితో నష్టం లేదు

'ఈ ప్రక్రియలో మోస్తరు వేడిని ఉపయోగించటం వల్ల నష్టమేమీ లేదు. విపరీతమైన వేడిని వాడితే నష్టం. స్వచ్ఛతను, విశిష్టతను కాపాడుతూ సూపర్ ఫుడ్‌ని ఉత్పత్తి చేస్తున్నాం' అని రోహన్ వివరించాడు. ఈ తోటలో దేన్నీ వృథాగా పారెయ్యటం లేదు. కొబ్బరి పొట్టును చెట్ల కింద ఆచ్ఛాదనగా వేస్తున్నారు. ఈ పంట వ్యర్థం తిరిగి మట్టిలోకి చేరుతోంది. కొబ్బరి పెంకులను యాక్టివేటెడ్ కార్బన్‌గా మార్చి తిరిగి వినియోగిస్తున్నారు. నూనె ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే పిప్పితో వర్మీకం?స్ట తయారు చేస్తున్నారు. కొబ్బరిలోని ప్రతి భాగం పర్యావరణ వ్యవస్థలో పాత్ర పోషించేలా చూసుకోవడమే లక్ష్యమని రోహన్ చెప్పారు.

### రోజూ ఒక చెంచా..

'వర్జిన్ కొబ్బరి నూనె పొట్ట ఆరోగ్యం, జీవక్రియ, కొలెస్ట్రాల్ నిర్వహణకు తోడ్పడుతుంది. దానిలోని యాంటీఆక్సిడెంట్లు, ప్రయోజనకరమైన మీడియం--చైన్ ఫ్యాటీ యాసిడ్ అయిన లారిక్ యాసిడ్ ఇందుకు ప్రధాన కారణం. అందుకే ప్రతి రోజూ ఒక చెంచా వర్జిన్ కొబ్బరి నూనెను తీసుకుంటే ఆరోగ్యం..' అంటారు రోహన్. 'నేను వర్జిన్ కొబ్బరి నూనె తీసే పని చేస్తాను. కొబ్బరి కాయల నుంచి కొబ్బరి తీసి ముక్కలు చేసి రుబ్బుతాం. అందులో నుంచి తర్వాత ?లు తీస్తాం. ఇది దాదాపు ఆరు గంటల పాటు నెమ్మదిగా జరిగే ప్రక్రియ' అని ఒక కార్మికుడు చెపారు.

### వ్యవసాయ పర్యాటకం

విలువలకు నిలబడుతూ శ్రద్ధగా ఆరోగ్యదాయకమైన, ?షకవంతమైన వ్యవసాయోత్పత్తులను ఉత్పత్తి చేసే వ్యవసాయ క్షేత్రం పర్యాటక కేంద్రంగా కూడా పేరుగాంచుతుందనటానికి రోహన్ క్షేత్రమే ఉదాహరణ. ఆసక్తి గల వారు బుక్ చేసుకొని 2.5 గంటల వ్యవసాయ ఆధారిత అనుభవాలను చవిచూస్తున్నారు. అతిథులు కొబ్బరి తోటల గుండా నడుస్తూ విషయాలు తెలుసుకుంటారు. చెట్టు నుంచి కాయలు కోయటం దగ్గరి నుంచి నూనె తయారీ వరకు జరిగే పనులన్నిటినీ చూస్తారు. స్థానిక పదార్థాలను ఉపయోగించి గ్రామీణ మహిళలు వండిన సాంప్రదాయ గోవా భోజనంతో ఈ అనుభవం ముగుస్తుంది. 'ఇది ఎక్కువ మందిని ఆకర్షించే పర్యాటకం కాదు. జీరో వేస్ట్ క్షేత్ర నిర్వహణ, ఆరోగ్యదాయకమైన ఆహారంపై సంభాషించడానికి మేం ఒక బ్యాచ్‌లో కొద్ది మందికి మాత్రమే ఆతిథ్యం ఇస్తామ'ని రోహన్ స్పష్టం చేశారు. త్వరలో కొబ్బరితో చిరుతిండ్లను ఉత్పత్తి చెయ్యనున్నామన్నారు. టోక్యోకి చెందిన అంతర్జాతీయ పర్యాటక సంస్థ స్కాల్ ఇంటర్నేషనల్ నుంచి గుర్తింపు దక్కటం ఆనందదాయకమని ఆయన సంబరపడుతున్నారు.

# ఏఐపై అత్యంత భారీ పెట్టుబడులు

## 240 బిలియన్ డాలర్లకు కట్టుబాటు ఏఐ సదస్సులో దిగ్గజాల వెల్లడి జాబితాలో ఆర్ఐఎల్, అదానీ, గూగుల్, టాటా

## ప్రభుత్వ గణాంకాల విడుదల

ఇటీవల నిర్వహించిన 2026 ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో భారీ పెట్టుబడులకు తెరలేచినట్లు ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఏఐపై కార్పొరేట్ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్‌సహా అదానీ గ్రూప్, గూగుల్, టాటా, లైట్‌స్పీడ్ వెంచర్స్ తదితరాలు ఉమ్మడిగా 240 బిలియన్ డాలర్లు(రూ. 21.84 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేసేందుకు కట్టుబాటును ప్రదర్శించాయి. గత నెల 16--21 మధ్య నిర్వహించిన ఏఐ సదస్సు సుమారు 6 లక్షల మంది హాజరైన అతిపెద్ద ఈవెంట్‌గా నిలుస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 100 దేశాల నుంచి ప్రతినిధులు, 20 అంతర్జాతీయ సంస్థలు వీటిలో పాలుపంచుకున్నట్లు వెల్లడించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫౌండేషన్ మోడళ్లు, హార్డ్‌వేర్, అప్లికేషన్లు తదితర విభాగాలలో 200 బిలియన్ డాలర్లకుపైగా ఏఐ సంబంధిత పెట్టుబడులకు కట్టుబాటు కనిపించినట్లు తెలియజేసింది.

దిగ్గజాలు ఇలా..




ఏఐ సదస్సులో డైవర్సిఫైడ్ దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏఐ ఆధారిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 110 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసేందుకు ప్రణాళికలు ప్రకటించింది. ఏడేళ్లలో వీటిని వెచ?ంచనున్నట్లు తెలియజేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2035కల్లా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలు వెల్లడించింది. జనరల్ కేటలిస్ట్ ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్‌కు కమిట్‌మెంట్‌ను ప్రకటించింది. ఈ బాటలో లైట్‌స్పీడ్ వెంచర్ పార్ట్‌నర్స్ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సిద్ధమని తెలియజేసింది. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కొత్తగా ఇండియా-- యూఎస్ సబ్‌సీ కేబుల్ మార్గంసహా.. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలు వెల్లడించారు. వీటిలో విశాఖపట్టణంలోని ఏఐ హబ్ సైతం కలసి ఉంది. ఇక టాటా గ్రూప్ ఏఐ రెడీ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యాన్ని ప్రకటించడం గమనార్హం! ఈ సదస్సులో దేశ సావరిన్ కంప్యూట్ సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు కీలక ప్రకటన వెలువడింది. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన 38,000 జీపీయూలకు జతగా కొద్ది వారాలలో మరో 20,000 జీపీయూలకు తెరతీయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో నేషనల్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరింత పటిష్టంకానుంది. 850 ఎగ్జిబిటర్లతో 10 థిమాటిక్ పెవిలియన్లతో ఏర్పాటైన ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఏఐ ఎగ్జిబిషన్‌లలో ఒకటిగా నిలిచినట్లు ప్రస్తావించింది.

# పోషక లోపాలు తీర్చే చొప్ప!

## పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులతో పశుపోషణలో సత్ఫలితాలు

దేశంలో పశువుల పోషకాహార లోటును పరిష్కరించడానికి పశు గ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ఒక సమర్థవంతమైన, సుస్థిరమైన పరిష్కారం. పంటలు పెరిగే దశలోనే వాటిలో అవసరమైన పోషకాల (జింక్, ఇనుము, రాగి వంటి సూక్ష్మపోషకాల) పరిమాణాన్ని, వాటి జీవ లభ్యతను సస్యవిజ్ఞాన పద్ధతుల్లో పెంపొందించుటుడాన్నే బయోఫోర్టిఫికేషన్ అంటారు.

### బయోఫోర్టిఫికేషన్ మూడు విధాలు:

1. నేల ద్వారా ఎరువుల వినియోగం.. పొలం మట్టిలో లోపించిన పోషకాలను లేదా సూక్ష్మపోషకాలను నీటిలో కలిపి నేలకు అందిస్తారు.

2. పంటలపై పిచికారీ చేయడం.. ఎరువులను ద్రవరూపంలో నేరుగా మొక్కల ఆకులపై పిచికారీ చేస్తారు. దీని వల్ల మొక్కలు పోషకాలను వేగంగా గ్రహిస్తాయి.

3. సూక్ష్మజీవుల ప్రయోగం.. నేలలో ప్రయోజనకరమైన సూక్ష్మజీవులను మట్టిలో కలుపుతారు. తద్వారా మొక్కలు నేల నుంచి పోషకాలను తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

### నత్రజని ప్రాముఖ్యత

పంట అభివృద్ధికి, పశుగ్రాస ఉత్పత్తికి నత్రజని చాలా కీలకమైన పోషకం. ఇది ప్రొటీన్లు, అమైనో ఆమ్లాలు, పత్రహరితం, ఇతర ముఖ్యమైన అణువుల నిర్మాణానికి అవసరం. నత్రజని ఎరువులు మేత నాణ్యతను, ముఖ్యంగా పొడి పదార్థం, ముడి మాంసకృత్తుల సాంద్రతను పెంచుతాయి. పరిశోధనా ఫలితాల ప్రకారం, హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు వాడినప్పుడు, మొక్కజొన్న గ్రాసంలో జింక్ (15.3%), రాగి (7.5%), మాంగనీస్ (28.4%), ఇనుము (15.6%) వంటి సూక్ష్మపోషకాల స్థాయిలు పెరిగాయి. నత్రజని (120 కిలోలు/హెక్టారు)ని పశువుల ఎరువుతో కలిపి వాడటం వల్ల పశు గ్రాసంలో ముడి ప్రొటీన్లు 36.56% వరకు పెరిగినట్లు పరిశోధనా ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

### గొర్రెల్లో జింక్ లోపం పోయింది

మొక్కజొన్న, అలసంద వంటి పశుగ్రాస పంటల పెరుగుదలకు, అధిక దిగుబడికి జింక్ చాలా ముఖ్యం. పశుగ్రాసంలో జింక్ లోపం ఉంటే పశువుల ఎదుగుదల తగ్గటం, పునరుత్పత్తి సమస్యలు, ఎముకలు, చర్మ కణజాలం దెబ్బతినటం జరుగుతాయి. 2020లో డా. గిరిధర్ బృందం బెంగళూరులో (ఐసీఏఆర్--ఎన్ఐఎన్‌పీ) ఒక అధ్యయనం చేసింది. జింక్ ఎరువులను నేలలో వేసి పండించిన జొన్న చొప్పను జింక్ లోపం ఉన్న గొర్రెలకు 120 రోజులపాటు ప్రయోగాత్మకంగా తినిపించారు. హెక్టారుకు 25 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తే జొన్న చొప్ప దిగుబడి హెక్టారుకు 4.2 టన్నులు పెరిగింది. చొప్పలో జింక్ పరిమాణం 14.4 పీపీఎం మేర వృద్ధి చెందింది. బయోఫోర్టిఫైడ్ చొప్ప తిన్న గొర్రెల్లో జింక్ స్థాయి పెరగటంతో పాటు.. రక్తంలోని జింక్ పరిమాణం పెరిగింది. వ్యాధి నిరోధక శక్తి పెరిగింది.



### రాగితో పెరిగిన దిగుబడి

పరిశోధనల ప్రకారం, ఓట్స్ పశుగ్రాస పంటకు నేల ద్వారా హెక్టారుకు 6 కిలోల రాగి అందించడం వల్ల దాని జీవలభ్యత పెరిగి దిగుబడి మెరుగుపడింది. అలాగే, విత్తిన 60--90 రోజుల్లో ఆకులపై 0.2% రాగిని పిచికారీ చేయటం వల్ల రాగి గ్రహణ శక్తి, దిగుబడి, ప్రొటీన్స్ గణనీయంగా పెరిగాయి. డా. సి.హెచ్. రామకృష్ణ బృందం హైదరాబాద్‌లో చేసిన పరిశోధన ఫలితాల ప్రకారం.. నేలకు హెక్టారుకు 25 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్‌ను సిఫారసు చేసిన ఎరువులతోపాటు దుక్కిలో వేస్తే.. పచ్చిమేతలో అత్యధిక జింక్ సాంద్రత (41.4 పీపీఎం) నమోదైంది. అలాగే, విత్తిన 15, 30, 45, 60 రోజుల తర్వాత 1% అన్నభేదిని ఆకులపై పిచికారీ చేస్తే అత్యధిక ఇనుము సాంద్రత (155.3 పీపీఎం) నమోదైంది. అంతేకాకుండా, ఈ పద్ధతులు సైలేజ్ (పాతరగడ్డి)లోని పోషక విలువలను కూడా మెరుగుపరిచాయి. అందువల్ల, ఇటువంటి బయోఫోర్టిఫైడ్ పశుగ్రాసం లేదా సైలేజ్‌ను ఎక్కువ కాలం మేతగా ఇవ్వడం వల్ల గొర్రెలలో శరీర బరువు, సగటు రోజువారీ పెరుగుదల, రక్తంలోని ఖనిజాల స్థాయిలను మెరుగుపరచవచ్చని నిరూపితమైంది. ఈ విధానం వల్ల నేల సారం పెరిగి పశుగ్రాస దిగుబడి పెరగడమే కాకుండా, ఇటు పశు వుల్లో అటు మనుషుల్లోనూ ఉన్న ఖనిజ లవణాల లోపాలను సరిదిద్దవచ్చని ఈ అధ్యయనం వెల్లడించింది.

### జీవన ఎరువుల ప్రాముఖ్యత

రసాయన ఎరువులు మితిమీరి వాడకం వల్ల భూమి నిస్సారమవడమే కాకుండా, పశు గ్రాసంలో పోషకాల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఈ సవాలును ఎదుర్కోవడంలో మొక్కల పెరుగుదల ప్రోత్సహించే అజోటోబాక్టర్, అజోస్పిరిలియం వంటి జాతుల జీవన ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయి. జీవసంబంధమైన నత్రజని స్థిరీకరణ, ఫాస్ఫేట్ కరిగింపు, ఫైటో హార్మోన్ల ఉత్పత్తి వంటి చర్యల ద్వారా పోషకాల లభ్యతను పెంచుతాయి. ఇవి జీవసంబంధంగా నత్రజనిని స్థిరీకరించడం ద్వారా పంటల నాణ్యతను, దిగుబడిని మెరుగుపరుస్తాయి. ఈ సుస్థిర పద్ధతులను అవలంబించడం వల్ల నేల సారాన్ని కాపాడుకుంటూనే పశుపోషణను లాభసాటిగా మార్చుకోవచ్చు.

### గణనీయమైన మార్పు..

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో కూడిన బయోఫోర్టిఫికేషన్ వ్యూహాల అమలు ద్వారా దేశ పశుపోషణ రంగంతోపాటు, ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చు. అయితే, పశు గ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ద్వారా మేత పోషక విలువను పెంచే పద్ధతి అమలుకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. నేలలోని పోషక అసమతుల్యతలు, ఉదాహరణకు అధిక ఫాస్ఫరస్ స్థ?థయిలు జింక్ శోషణను నిరోధించడం వంటివి మొక్కల పోషక గ్రహణ శక్తిని దెబ్బతీస్తున్నాయి. వేడిగాలులు, కరువులు, వర్షపాతంలో ఒడిదుడుకులు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు పంట పెరుగుదలను, పోషకాల గ్రహణను నిరోధిస్తాయి. ఆర్థిక, సామాజిక అంశాలు కూడా ఈ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయి. సూక్ష్మపోషక ఎరువులు, అధునాతన సాంకేతికతలతో కూడిన ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల చిన్న రైతులు ఇటువంటి నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించలేక పోతున్నారు. పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులపై మరింత పరిశోధన జరగాలి. ఖర్చు--ప్రభావంపై దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరం.

# చాట్‌జీపీటీని బాయ్‌కాట్ చేసిన 25 లక్షల మంది!




అమెరికా రక్షణ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సేవలపై వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. చాట్‌జీపీటీని బహిష్కరించాలంటూ ప్రతిజ్ఞకు పిలుపునిచ్చిన ఒక వెబ్‌సైట్.. ఇప్పటికే సుమారు 25 లక్షల మంది వినియోగదారులు చాట్‌జీపీటీని బాయ్‌కాట్ చేసినట్లు పేర్కొంది. 900 మిలియన్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ఓపెన్‌ఏఐ గత వారం అమెరికా రక్షణ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. రక్షణ శాఖ తన వర్గీకృత నెట్‌వర్క్‌లో ఏఐ మోడల్‌ను అమలు చేయడానికి అనుమతి లభించింది. ఈ డీల్‌తో వినియోగదారుల అసంతృప్తి పెరుగుతోందని ఆ వెబ్‌సైట్ వెల్లడించింది. సంతకాల సంఖ్య, సోషల్ మీడియా షేర్లు, యాప్ వినియోగ డేటా ఆధారంగా ప్రజలు చాట్‌జీపీటీపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొంది. "అమెరికన్లతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్లను చాట్‌జీపీటీ నుంచి నిష్క్రమించడానికి మేము సమన్వయం చేస్తున్నాం. వినియోగదారుల చర్యల ద్వారా ఓపెన్‌ఏఐకు స్పష్టమైన సందేశం పంపవచ్చు" అని వెబ్‌సైట్ పేర్కొంది. ఇదిలా ఉండగా, సెన్సార్ టవర్ విశ్లేషణ ప్రకారం.. పెంటగాన్ నుంచి తప్పుకొన్న ఆంథ్రోపిక్ రూపొందించిన 'క్లాడ్' చాట్‌బాట్ యాప్, అమెరికాలో యాపిల్ యాప్ స్టోర్ చార్టుల్లో చాట్‌జీపీటీ యాప్‌ను అధిగమించి అగ్రస్థానానికి చేరినట్లు సమాచారం. అలాగే టెక్‌క్రంచ్ నివేదిక ప్రకారం.. గత శనివారం చాట్‌జీపీటీ మొబైల్ యాప్ యూఎస్‌లో అన్‌ఇన్‌స్టాల్‌ల సంఖ్య రోజుకు 295 శాతం పెరిగినట్లు వెల్లడైంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .